

సెలవుపై జిల్లా గనులశాఖాధికారి

వైసీపీ నేతలతో అంటకాగారనే ఆరోపణలపై చర్యలు

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా గనులశాఖ అధికారి ఎం.జగన్నాథరావును సెలవుపై వెళ్లాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. గత ప్రభుత్వ పాలకులతో అంటకాగారన్న ఆరోపణల నేపథ్యంలో రాష్ట్రంలో పలు జిల్లాల అధికారులు సెలవుపై వెళ్లాలని ఆదేశించారు. ఈ జాబితాలో విశాఖ జిల్లా గనులశాఖాధికారి జగన్నాథరావు ఉన్నారు. రెండు నెలల క్రితం జిల్లాకు వచ్చిన ఆయన స్థానంలో అనకాపల్లి జిల్లా గనులశాఖాధికారి ఎం.శ్రీనివాసరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

వాహన చోదకులపై దొంగ దెబ్బ

నోపార్కింగ్‌లో బైక్ పెట్టారంటూ జరిమానా

ఎడాపెడా ట్రాఫిక్ చలానాలు

- నగరంలో పార్కింగ్ స్థలాల ఆక్రమణ
- భవన యజమానులు, దుకాణదారులపై కనిపించని చర్యలు
- చలానాలను ఆదాయ వనరుగా భావిస్తున్న పోలీసులు

(విశాఖపట్నం,ఆంధ్రజ్యోతి)

హనుమంతరావు సరకులు కొనుగోలుచేసేందుకు ద్విచక్రవాహనంపై సీతమ్మధార రైతు బజారుకు వెళ్లారు. ఆ మరుసటి రోజు ఆయన మొబైల్‌కు సిటీ పోలీసులు పంపిన ట్రాఫిక్ చలానా వచ్చింది.

కనకరాజు బ్లడ్ షుగర్ పరీక్ష చేయించుకోవడానికి గురుద్వారా జంక్షన్ బస్టాప్ దగ్గరున్న మెడికల్ ల్యాబ్‌కు స్కూటర్‌పై వెళ్లారు. సాయంత్రం ఆయన మొబైల్‌కి ట్రాఫిక్ చలానా వచ్చింది. ఈ రెండుచోట్ల వారు పెట్టిన ఖర్చు కంటే చలానా రూపంలో వచ్చిన మొత్తం రెట్టింపు.

ఇది వీరిద్దరికి ఎదురైన సమస్య కాదు.. నగరంలో ప్రధాన ప్రాంతాలకు వెళ్లే వందల సంఖ్యలోని ద్విచక్ర వాహన చోదకులకు సిటీ పోలీసులు ఇస్తున్న ఝలక్. ఈ చలానాలన్నీ 'నో పార్కింగ్'కు సంబంధించినవి కావడం గమనార్హం.

సాధారణంగా ట్రాఫిక్ సిగ్నల్ జంప్ చేసినా, హెల్మెట్ పెట్టుకోకున్నా, ఓవర్ స్పీడ్‌గా డ్రైవ్ చేసినా, డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా చలానా వేయడం రివాజు. ఇవన్నీ సహేతుక కారణాలే. కానీ నగరంలో సరైన పార్కింగ్ సదుపాయం కల్పించకుండా, పార్కింగ్ స్థలాలను వ్యాపారులు ఆక్రమించినా పట్టించుకోకుండా, యజమానులు లేని సమయంలో, వారి ద్విచక్ర వాహనాలకు వెనుక నుంచి ఫొటోలు తీసి చలాన్లు పంపడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



గురుద్వారా బస్టాప్ వద్ద ద్విచక్ర వాహనాలకు ఫొటోలు తీస్తున్న కానిస్టేబుల్



సీతమ్మధార రైతుబజారు వద్ద పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణాలు

పార్కింగ్ స్థలాలేవీ?

నగరంలో ఏ ప్రాంతంలోనూ పార్కింగ్ స్థలాలు అందుబాటులో లేవు. అదీకాకుండా పోలీసులు ఫొటోలు తీసి చలానాలు పంపుతున్న ప్రదేశాల్లోని పార్కింగ్ స్థలలు ఆక్రమణకు గురయ్యాయి. దీనిపై పోలీస్, జీవీఎంసీ అధికారులు ప్రధానంగా దృష్టిసారించాలి. పార్కింగ్ స్థలాలున్నా, రహదారులు, ఇతర ప్రాంతాల్లో వాహనాలను నిలిపితే చలానాలు వేయాలి. కానీ పార్కింగ్ స్థలాలే లేకుండా విధిస్తుండడంతో పోలీసులు విమర్శలకు గురవుతున్నారు. రోడ్డు మార్జిన్‌లు, పార్కింగ్‌ను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారు, సెల్లార్లలో వ్యాపారాలు చేసుకునేవారు, అలా అవకాశం కల్పించిన అవినీతి అధికారులపైనా కనీస చర్యలు లేవు. కానీ ద్విచక్ర వాహనాలకు ఫొటోలు తీసి వాహనంతో లింక్ అయిన మొబైల్ నంబరుకు చలాన్లు పంపుతున్నారు. మూడు

... మిగతా 6వ పేజీలో

ఇటీవల నగరంలో పెరుగుతున్న దొంగతనాలు

చోరీల నియంత్రణపై కనిపించని కార్యాచరణ?

- ఘటన తర్వాత కేసు దర్యాప్తుపైనే పోలీసుల దృష్టి
- ముందస్తు నియంత్రణ చర్యలపై నిర్లక్ష్యం
- మొక్కుబడిగా మారిపోయిన రాత్రి గస్తీ
- సీపీ దృష్టిసారించకుంటే చోరీలకు అడ్డుకట్ట అసాధ్యమంటున్న నగరవాసులు

(విశాఖపట్నం,ఆంధ్రజ్యోతి)

నగరంలో చోరీల నియంత్రణకు పోలీస్ శాఖా పరంగా కార్యాచరణ కొరవడిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కాలంలో వరుసచోరీలు నమోదవుతుండడం దీనికి బలాన్ని చేకూర్చుతోంది. చోరీ జరిగిన తర్వాత దర్యాప్తుపై దృష్టిపెడుతున్న పోలీసులు... చోరీలు జరగకుండా చేపట్టాల్సిన చర్యలపై దృష్టిసారించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నేర నియంత్రణపై సీపీ శంఖబ్రత బాగ్చి స్వయం గా దృష్టిసారించకపోతే చోరీలకు అడ్డుకట్టవేయడం సాధ్యం కాదని పోలీసులే అభిప్రాయపడుతున్నారు.



పెందుర్తిలో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్ ఫొటో)

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రతి ఏటా 800 చోరీ కేసులు నమోదవుతుంటాయి. వీటిలో సగటున రూ.ఆరు కోట్ల విలువైన సొత్తు అపహరణకు గురవుతుంది. కేసు నమోదుచేసిన తర్వాత పోలీసులు దర్యాప్తు చేసి, చోరీకి గురైన సొత్తులో దాదాపు 60 శాతం విలువైన సొత్తుని రికవరీ చేయగలుగుతుంటారు. ఈ ఏడాది విషయానికి వస్తే పోలీస్ వర్గాల అంతర్గత సమాచారం ప్రకారం ఇప్పటికే 700 వరకూ చోరీ కేసులు నమోదైనట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో నగరంలో చోరీల సంఖ్య పెరిగిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

పనిచేయని సీసీ కెమెరాలు

నగరంలో నేర నియంత్రణలో కీలకంగా భావించే సీసీ కెమెరాల పనితీరు గతంలో పోల్చితే తీసికట్టుగా మారింది. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా జీవీఎంసీ అమర్చిన సీసీ కెమెరాల్లో సగానికి పైగా కెమెరాలు ప్రస్తుతం పనిచేయడం లేదు. ట్రాఫిక్ కూడళ్ల వద్ద పోలీస్‌శాఖ ఏర్పాటుచేసిన కెమెరాల్లో కూడా చాలావరకూ మరమ్మతులకు గురయ్యాయి. గతంలో పోలీసులు చొరవ తీసుకుని ప్రజా భద్రత చట్టం పేరుతో వ్యాపారులు, అపార్టుమెంట్లు, యూనియన్లు, అసోసియేషన్లు, ఆలయ కమిటీలతో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు కూడా ఏళ్లు గడిచిపోవడంతో వాటిలో కొన్ని మూలకు చేరిపోయాయి. దీనివల్ల ఎక్కడైనా చోరీ జరిగితే దానికి సంబంధించిన ఆధారాలు పోలీసులకు లభ్యం కావడంలేదు. దీనివల్ల కేసుల దర్యాప్తు ముందుకు సాగకపోవడంతో దొంగలు తప్పించుకోగలుగుతున్నారు.

మొక్కుబడిగా రాత్రి గస్తీ

దీనికితోడు నగరంలో రాత్రిగస్తీ మొక్కుబడిగా మారిపోయిందనే విమర్శలు వినిస్తున్నాయి. రోజురోజుకీ రాత్రిబీట్లు పెరగాల్సింది పోయి, తగ్గిపోతున్నాయని పోలీసులే అంగీకరిస్తున్నారు. ఇది కూడా చోరీలు పెరగడానికి ఒక కారణంగా చెబుతున్నారు. పోలీసుల నిఘా కొరవడడం, చోరీ చేసినా ఆనవాళ్లను పోలీసులు అంతసులభంగా గుర్తించలేరనే ధీమాతో కొంతమంది ఆకతాయిలు, పాత నేరస్థులు చోరీలకు పాల్పడుతున్నారు.

హడలెత్తిస్తున్న వరుస ఘటనలు

ఇటీవల వరుస చోరీలు నగర వాసులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. జీవీఎంసీ పరిధి 95 వార్డు పాపయ్యరాజుపాలెంలో తాళం వేసి ఉన్న ఇంట్లో ఈనెల ఒకటిన రాత్రి దొంగలు పడి బీరువాలోని ఎనిమిది తులాల బంగారం, 50 తులాల వెండి అపహరించుకుపోయారు. పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధి చినముషిడివాడ సమీపంలోగల సప్తగిరినగర్ సాయిబాబా ఆలయంలో దొంగలు హుండీ తెరిచి అందులోని డబ్బు దోచుకెళ్లారు. అదే పోలీస్‌స్టేషన్ పరిధి శ్రమశక్తినగర్‌లోని ఆలయంలో దొంగలు పడ్డారు. ఏకంగా ఆలయంలోని హుండీని ఎత్తుకొచ్చి నగదు అపహరించుకుపోయారు. హుండీని, చిల్లరనాణేలను అక్కడే పడేసి పరారైపోయారు. గంజాయి బ్యాచ్‌కు చెందినవారు ఆలయంలో చోరీలకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ కోణంలోనే కేసు దర్యాప్తు చేస్తున్నారు. సీతమ్మధార ఆక్సిజన్

... మిగతా 6వ పేజీలో

అంగన్‌వాడీ కేంద్రాలకు ఊరట

- మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు
- వంద రోజుల ప్రణాళికలో భాగంగా విడుదల చేసిన కూటమి ప్రభుత్వం
- 52 కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు
- 74 కేంద్రాలకు రక్షిత నీటి సదుపాయం



గోరింట అంగన్‌వాడీ కేంద్రానికి అమర్చిన వాటర్ ట్యాంకు

విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు భారీగా నిధులు విడుదల చేసింది. జిల్లాలో ఇప్పటికే పలు కేంద్రాల్లో పనులు ప్రారంభించగా, వచ్చే నెలాఖరుకు పూర్తికావాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో

... మిగతా 6వ పేజీలో

దుకాణం.. వివాదం!

- మద్యం దుకాణాల ఏర్పాటుకు నిర్వాహకుల పాట్లు
- కొన్నిచోట్ల తలెత్తుతున్న వివాదాలు
- సహచర వ్యాపారులే ఆజ్యం పోస్తున్నారని అనుమానం
- అస్మదీయులకు మేలు చేసేందుకు అధికారుల పరోక్ష సహకారం

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

నగరంలో కొన్నిచోట్ల మద్యం దుకాణాల ఏర్పాటుపై వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. లాటరీలో దుకాణాలు దక్కించుకున్న వారిలో కొందరు సిండికేట్‌లో కలవకుండా సొంతంగా వ్యాపారం చేసుకోవాలనే ఆలోచనతో ఉన్నారు. వారిని ఆర్థిక, రాజకీయ బలం కలిగినవారు, మద్యం వ్యాపారంలో పాతుకుపోయినవారు ఇబ్బందులకు గురిచేస్తున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. దుకాణం ఏర్పాటుచేయాలనుకునే ప్రాంతంలో కొందరిని వ్యతిరేకంగా ఉసిగొల్పి... మరోచోట ఏర్పాటుచేసుకోవాలని అధికారుల ద్వారా ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



వన్‌టౌన్ పందిమెట్ట జంక్షన్‌లో మద్యం దుకాణం ఏర్పాటును నిరసిస్తూ మహిళల ఆందోళన (ఫైల్ ఫొటో)

జీవీఎంసీ పరిధిలో 155 మద్యం దుకాణాలను కేటాయించారు. చాలాచోట్ల సాధారణ వ్యక్తులకు లాటరీలో దుకాణాలు దక్కాయి. గతంలో మద్యం వ్యాపారంలో చక్రం తిప్పిన సిండికేట్లు, ప్రస్తుత రాజకీయ నాయకుల అనుచరులు, బినామీ పేర్లతో భారీగా దరఖాస్తులు చేసినప్పటికీ దక్కకపోవడంతో నిరాశకు గురయ్యారు. దీంతో దుకాణాలు దక్కించుకున్న వారిలో మద్యం వ్యాపారంలో అనుభవం లేని వారిని, రాజకీయంగా అండదండలు లేని వారిని గుర్తించి వారి నుంచి ఏదోవిధంగా దుకాణాలను లాక్కొనేందుకు వ్యూహరచన చేశారు. అందులో భాగంగా వారికి దుకాణం ఏర్పాటుచేసుకునేందుకు షాపులు దొరక్కుండా చేయడం, షాపులు సమకూరినా గుడి, బడి నిబంధన పేరుతో అధికారులతో అభ్యంతరం చెప్పించడం, స్థానికులను ఉసిగొల్పి ఆందోళనలకు దింపుతున్నారనే ప్రచారం జరుగుతోంది.

ఇవీ ఉదాహరణలు...

ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని హేలాపురి రెస్టారెంట్ ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ సెల్లార్‌లో ఒకరు మద్యం దుకాణం ఏర్పాటుచేసుకున్నారు. అక్కడికి సమీపంలోనే బార్ ఉండడంతో ఆ యజమాని దుకాణాన్ని ఏర్పాటుచేయకుండా చూడాలని అధికారులను కోరినట్టు తెలిసింది. దీంతో ఎక్సైజ్ శాఖలోని కీలక అధికారి అక్కడకు వెళ్లి సెల్లార్‌లో దుకాణం ఏర్పాటుచేయకూడదని, మరోచోట చూసుకోవాలని ఆదేశించారు. సీతమ్మధార నార్త్ టక్స్‌టెన్షన్ ఎస్‌ఆర్‌ఐ ఆస్పత్రి రోడ్డులో ఒక దుకాణం

... మిగతా 6వ పేజీలో

ఆరోగ్యశాఖలో ఎఫ్‌ఆర్‌ఎస్



- ఉద్యోగులు సమయపాలన పాటించేలా కీలక ఆదేశాలు
- తొలుత నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు అమలు
- ఆ తరువాత మిగిలిన ఉద్యోగులకు వర్తింపు
- రెండు రోజులు ఆలస్యమైతే సీఎల్‌లో కోత
- మూడు రోజులు దాటితే వేతనాలు కట్

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):

వైద్య, ఆరోగ్యశాఖలో ఫేషియల్ రికగ్నేషన్ సిస్టమ్ (ఎఫ్‌ఆర్‌ఎస్)ను ఇకపై పక్కాగా అమలుచేయనున్నారు. ముఖ్యంగా నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేసే ఉద్యోగులకు ఈ విధానాన్ని తొలుత అమలుచేసేలా ఆదేశాలందాయి. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే ఉద్దేశంతో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు.

నేషనల్ హెల్త్ మిషన్‌లో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యసేవలు అందించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. నగర పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్స్, రక్త నిధి కేంద్రాలు, సాక్స్ సెంటర్స్‌లో పనిచేసే వారు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులే. వీరందరి జీతాలకు ఎఫ్‌ఆర్‌ఎస్‌కు ముడిపెడుతూ ఆదేశాలిచ్చారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేసే ఉద్యోగులు వారికి కేటాయించిన విభాగాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండాలి. అందుకు అనుగుణంగా ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో ముఖహాజరు నమోదు చేసుకోవాలి. రెండు రోజులు ఆలస్యమైతే ఒక సీఎల్, మూడు రోజులు ఆలస్యమైతే వేతనాల్లో కోతవిధిస్తారు. రాష్ట్ర స్థాయి ఉద్యోగులు హాజరును పర్యవేక్షించనున్నారు. ఈ మేరకు ఉద్యోగులకు స్పష్టమైన ఆదేశాలు అందించినట్టు జిల్లా

... మిగతా 6వ పేజీలో

నక్కపల్లికి మహర్దశ

- మెగా ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్ కంపెనీలు సంసిద్ధత
- మొత్తం పెట్టుబడులు రూ.1.4 లక్షల కోట్లు
- మొదటి దశలో రూ.70 వేల కోట్లు
- రాష్ట్ర ప్రభుత్వ పిలుపుతో వేగంగా స్పందించిన ప్రముఖ స్టీల్ కంపెనీలు
- అందుబాటులో వీసీఐసీ భూములు
- వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరి నెలల్లో శంకుస్థాపన?
- సాకారం అయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 50 వేల మందికి ఉపాధి
- జిల్లా వాసుల్లో హర్షాతిరేకాలు

నక్కపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి మండలానికి మహర్దశ పట్టనున్నది. విశాఖపట్నం, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లోని నక్కపల్లి క్లస్టర్‌లో భారీ ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కానున్నది. ప్రైవేటు రంగంలో సుమారు రూ.1.4 లక్షల కోట్ల తో స్టీల్‌ప్లాంట్ నిర్మించడానికి భారత్‌కు చెందిన ఆర్సెలర్ మిట్టల్, జపాన్‌కు చెందిన నిప్పన్ స్టీల్ కంపెనీలు ముందుకు వచ్చాయి. కొద్దిరోజుల్లోనే ఈ కంపెనీల ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమావేశమై, మిగిలిన అంశాలు చర్చిస్తారని సమాచారం. వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరిలో శంకుస్థాపన చేస్తారని తెలిసింది. నక్కపల్లి మండలంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు విషయాన్ని శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రకటించడంతో నియోజకవర్గం ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

నవ్యాంధ్ర తొలి సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు.. పాయకరావుపేట నియోజకవర్గాన్ని పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో 2015లో 'విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (వీసీఐసీ) పేరుతో భూ సేకరణకు శ్రీకారం చుట్టారు. అప్పట్లో జిరాయితీతోపాటు డి.పట్టా భూములకు కూడా ప్రభుత్వం సంతృప్తికరమైన పరిహారం ఇచ్చింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు ఇండస్ట్రియల్ కారిడార్‌ను పట్టించుకోలేదు. గత ఏడాది బల్క్ డ్రగ్స్ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. ఇది కార్యరూపం దాల్చలేదు. ఎన్నికల్లో కూటమి విజయం సాధించింది. రాష్ట్రానికి పెద్దఎత్తున పరిశ్రమలు తీసుకురావాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా పాయకరావుపేట నియోజకవర్గంలో ప్రైవేటు రంగంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. లోకేశ్ అమెరికా పర్యటనలో ప్రపంచస్థాయి పారిశ్రామిక వేత్తలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనకాపల్లి జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు గురించి మాట్లాడారు. ఇది జరిగిన



విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూములు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కానున్నది ఈ ప్రాంతంలోనే

... మిగతా 6వ పేజీలో



కప్ప స్తంభం వద్ద శాప్ చైర్మన్ రవినాయుడు

ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ

» శాప్ చైర్మన్ రవినాయుడు

సింహాచలం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఒలింపిక్స్‌లో పతకాలు సాధించేలా క్రీడాకారులను తీర్చిదిద్దడమే తమ సంస్థ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ రవినాయుడు అన్నారు. ఆదివారం ఆయన అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ దేశఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసే విధంగా యువతకు క్రీడల్లో మంచి నైపుణ్యత ఇవ్వడమే తమ లక్ష్యమని తెలిపారు. ఆయనతో పాటు రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి సతివాడ శంకరరావు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమ్మినేని మోహన్, విశాఖ పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షుడు తాతాజీ ఉన్నారు.

నెట్ బాల్ టోర్నమెంట్‌కు ఎంపిక పోటీలు రేపు

భీమునిపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ది సన్ స్కూల్‌లో ఈనెల 5న ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయిలో బాల, బాలికలకు నెట్ బాల్ టోర్నమెంట్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు స్కూల్ కరస్పాండెంట్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డీఈఓ ఆదేశాల మేరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు (అండర్ 17) జరగనున్నాయని చెప్పారు. పోటీలను కార్పొరేటర్లు గాడు చిన్నికుమారి లక్ష్మి, గంటా అప్పలకొండ ప్రారంభిస్తారని, సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఎంపికైన వారు నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్టు తెలిపారు.

నేటి నుంచి కుటుంబ సర్వే

పద్మనాభం రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు కుటుంబ సర్వే (బీసీ) చేపట్టనున్నట్టు ఎంపీడీవో విజయకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీ కులాల అభివృద్ధికి ప్రత్యేక పథకాలు అమలు చేయడానికి ప్రభుత్వం ప్రణాళిక చేస్తున్నట్టు చెప్పారు. ఈమేరకు 32 బీసీ కులాల కుటుంబాలు సర్వే సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

భీమిలి జోన్ పబ్లిక్ వర్క్స్ ఏఈగా సురేశ్

భీమునిపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ భీమిలి జోన్ పబ్లిక్ వర్క్స్ ఏఈగా జి. సురేశ్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ ఏఈగా పనిచేసిన సుమన్‌ను జోన్ 5కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో సురేశ్ వచ్చారు. ఆయనకు మంచినీటి సరఫరా విభాగం, వీధి లైట్ల నిర్వహణ, పబ్లిక్ వర్క్స్ విభాగాన్ని కూడా అప్పగించారు.


38 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న దాతలు

మధురవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎంవీవీ సిటీలో సత్యసాయి 99వ జయంత్యుత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీవీ సాయి సెంటర్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ సౌజన్యంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ నాయుడు, రోటరీ క్లబ్ చైర్మన్ బీఎస్ రాజు ప్రారంభించారు. 38 మంది దాతలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పీఎంపాలెం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ప్రభాకర్, రామినాయుడు, టీవీ శివాజీ, ఏవీ రామకృష్ణ, టి.జ్యోతి, ఎ. నాగమణి, టి. గౌతమ్ పాల్గొన్నారు.

కొనసాగిన తిరు నక్షత్ర పూజలు



పారాయణలు చేస్తున్న అర్చకులు

సింహాచలం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో నమ్మాళ్వారు తిరు నక్షత్ర పూజలు రెండవ రోజు ఆదివారం కూడా కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ, ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. అనంతరం లోక కల్యాణార్థం అన్న సంకల్పంతో తిరు నక్షత్ర పూజలు కొనసాగించారు. స్వామివారికి ఉపచారాలు సమర్పణ తరువాత మంత్ర పుష్పం, కర్పూనీరాజనాలిచ్చారు. రాజభోగ నివేదన వేళ మధ్యాహ్నం ప్రత్యేక నివేదనలు జరిపారు.

నగరపాలెం రోడ్డులో గుంతలు

» మరమ్మతులు చేపట్టని అధికారులు

» ప్రమాదాల బారిన వాహనదారులు

భీమునిపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలుచోట్ల రహదారులకు గుంతలు ఏర్పడడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. 3, 4 వార్డుల్లోని చాలా ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా నగరపాలెం రహదారిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. నృసింహనగర్ రోడ్డులో కూడా భారీగా గోతులు ఏర్పడ్డాయి. గంభీరం గెడ్డ వంతెన వద్ద, సమీపంలోనూ గోతులు ఉండడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాకాలంలో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. గుంతల్లో నీరు చేరడం వల్ల ఎక్కడ గొయ్యి ఉందో.. ఎక్కడ రోడ్డు ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడు తున్నారు. అలాగే నగరపాలెం నుంచి గ్రేహౌండ్స్ మీదుగా మారికవలస వెళ్లే రహదారిలోనూ, వంద అడుగుల రహదారిలోనూ, 3వ వార్డు ఏపీఆర్ఎస్ జంక్షన్ నుంచి నేరేళ్ళవలస జంక్షన్, గొల్లవీధి మీదుగా చిన్నబజారు జంక్షన్ వరకూ వెళ్లే రోడ్డు కూడా గుంతలమయంగా తయారైంది.



రహదారిలో పలుచోట్ల ఏర్పడిన గుంతలు

సీఎం చంద్రబాబు దృష్టికి పంచ గ్రామాల భూ సమస్య

సింహాచలం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచ గ్రామాల భూ సమస్యను 98వ వార్డు కార్పొరేటర్ పిసిని వరాహ నరసింహం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. శనివారం విశాఖ పర్యటనకు వచ్చిన సీఎంను ఆయన కలిసి భూసమస్యపై వినతిపత్రం అందజేశారు. పంచ గ్రామాల భూ సమస్యతో పాటు జీవీఎంసీ చేపట్టిన బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ ఫేజ్-2లోని నిర్వాసితులకు టీడీఆర్‌లు ఒకేవిధంగా ఇప్పించాలని, వాటికి సేల్ ఆప్షన్ ఉండేలా సాంకేతిక అనుమతులు మంజూరు చేయాలని విన్నవించారు. వీటిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ నరసింహం తెలిపారు.



చంద్రబాబుకు సమస్యను వివరిస్తున్న నరసింహం



పల్లా శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న నాయకులు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాకు వినతి

పంచ గ్రామాల భూ సమస్యకు తక్షణమే పరిష్కారం చూపాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం ప్రధాన కార్యదర్శి టివి కృష్ణంరాజు మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

ఇళ్ల మరమ్మతుకు అనుమతి జారీ

పంచ గ్రామాల భూ బాధితులు ఇళ్ల మరమ్మతు చేసుకోవడానికి దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈసమస్యను ఐదు నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి పలుమార్లు అభ్యర్థనలు చేయడంతో ఇళ్లకు మరమ్మతుకు అనుమతులు జారీ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇళ్ల మరమ్మతుకు ముందుగా దేవస్థానం భూ పరిపాలనా విభాగానికి దరఖాస్తు చేసుకోవాలని, ఇంటి దుస్థితిని తెలిపే ఫొటోలను జత చేయాలని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

230 మందికి నేత్ర వైద్య పరీక్షలు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చిప్పాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 230 మంది విద్యార్థులకు సింహాచలం శంకర్ ఫౌండేషన్ వైద్యులు ఆదివారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. స్థానిక ఎంఎస్ఆర్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన శిబిరంలో వైద్యులు రాహుల్, రమేశ్, లక్ష్మి విద్యార్థులను పరీక్షించి, మందులు అందజేశారు. ఆ కార్యక్రమంలో సర్పంచ్ రమాదేవి, స్థానిక నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని నిరసన

కొమ్మాది, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) :కొమ్మాదిలో రామాలయానికి చెందిన 1500 గజాల స్థలానికి తప్పుడు పత్రాలు సృష్టించి విక్రయించిన వారిని గుర్తించి శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురుపిళ్ల పైడిరాజు డిమాండ్ చేశారు. కొమ్మాదిలో అమ్మకానికి గురైన భూమిలో సీపీఐ, సీపీఎం నాయకులు గ్రామస్తులతో కలిసి ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల్లో దేవాలయానికి చెందిన భూమి అని స్పష్టంగా ఉన్నా, పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో (గత నెల 26న) 750 గజాల చొప్పున అమ్మకం చేయడం దారుణమన్నారు. మధురవాడలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉండగా పెదగంట్యాడలో చేయాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. స్థానికుల సహకారం లేకుండా ఇటువంటివి జరగవని, వారి ప్రమేయంపై కూడా విచారణ జరపాలని కోరారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు అప్పలరాజు, సత్యనారాయణ, బేగం, పైడితల్లి, సన్యాసిరావు పాల్గొన్నారు.

గంభీరంలో ఘనంగా గోవర్ధన పూజ

ఆనందపురం నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గంభీరం పంచాయతీ ఐఐఎం రోడ్డులో ఉన్న హరే కృష్ణ మూవ్మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం గోపూజ, గోవర్ధన పూజ ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఊరేగించి, గోపూజ, గోవర్ధన పూజ, దామోదర హారతి అంగరంగ వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్మెంట్ విశాఖ జిల్లా అధ్యక్షుడు నిష్కించన భక్తదాస గోవర్ధన లీలా విశేషాలను భక్తులకు వివరించారు. అనంతరం ఐదు వేల లడ్డూలతో, 108 రకాల వంటకాలతో అన్నకూట్ తయారు చేసి పూజలు జరిపారు.

వాహనదారులకు జరిమానా

భీమునిపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) :పట్టణంలోని బీచ్ రోడ్‌లో అధిక శబ్దం కలిగించే సైరన్‌లతో బైక్‌లపై ప్రయాణించిన నలుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని బైక్‌లతో పాటు స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. బైక్‌లకు అధిక శబ్దాన్నిచ్చే సైరన్లను తొలగించి, సాధారణ శబ్దం వచ్చే సైరన్‌లు ఏర్పాటు చేయడంతో పాటు యువకులకు జరిమానా విధించామని ఎస్ఐ హరీష్ తెలిపారు.

నక్కపల్లికి మహర్దశ

... 5వ పేజీ తరువాయి

గంటల వ్యవధిలోనే ఆర్సెలర్ మిట్టల్, జపాన్‌కు చెందిన నిప్పన్ స్టీల్ కంపెనీ సానుకూలంగా స్పందించాయి. రూ.1.4 లక్షల కోట్ల వ్యయంతో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకుసంసిద్ధత వ్యక్తం చేశాయి. రూ.70 వేల కోట్లతో మొదటిదశ నిర్మాణం చేపడతారు. ఇందుకు 2,640 ఎకరాల భూములు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిసింది. నక్కపల్లి మండలంలో 'విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఇప్పటికే భూములు సేకరించినందున కొత్తగా భూ సేకరణ చేపట్టాల్సిన పనిలేదు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు మండలంలోని రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, ఎన్.నర్సాపురం, వేంపాడు, డీఎల్‌పురం రెవెన్యూ గ్రామాల్లోని ఏపీఐఐసీ భూములు పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది. విద్యుత్, నీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలి. రోడ్డు, రైలు, సముద్ర మార్గాలు అందుబాటులో వున్నాయి. ముడి సరకు దిగుమతి, ఉక్కు ఉత్పత్తుల ఎగుమతుల కోసం నక్కపల్లి మండలం రాజయ్యపేట వద్ద శాటిలైట్ పోర్టు నిర్మాణం చేపట్టే అవకాశం వుంది. ఆర్సెలర్ మిట్టల్ ప్రపంచంలో ఉక్కు ఉత్పత్తి చేసే కంపెనీల్లో రెండో స్థానంలో వుంది. మన దేశంలో నాణ్యమైన ఇనుప ఖనిజం అందుబాటులో వుండడంతో తమ దేశ అవసరాలకు ఉత్తమశ్రేణి ఉక్కు ఉత్పత్తి కోసం నక్కపల్లి ప్రాంతంలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు జపాన్‌కు చెందిన నిప్పన్ కంపెనీ ఆసక్తిగా వున్నట్టు సమాచారం. ఉక్కు ఉత్పత్తికి అవసరమైన ముడి ఖనిజం, ఇతర సరకులను ఎన్ఎండీసీ సరఫరా చేసే అవకాశం ఉంది. స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే ప్రత్యక్షంగా 20 వేల మందికి ఉద్యోగాలు, పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా వేస్తున్నారు. ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో మొదటిదశ నిర్మాణ పనులను 2029నాటికి పూర్తి చేస్తామని మిట్టల్ సంస్థ పేర్కొంది.ఆ తరువాత రెండో దశ పనులకు 3,800 ఎకరాల భూములు కావాల్సి వుంటుందనిప్రభుత్వాన్ని కోరింది. ప్రైవేటు సంస్థ కావడం, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు, సదుపాయాలు శరవేగంగా సమకూర్చే అవకాశాలుండడంతో ఐదేళ్లలో స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభం అవుతుందని అధికారవర్గాలు భావిస్తున్నాయి.



పర్యాటకులతో సందడిగా ఉన్న రుషికొండ బీచ్

రుషికొండ బీచ్‌కు సందర్శకుల తాకిడి

సాగర్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్ సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది. వీకెండ్, బెంగాల్ సీజన్ కావడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కొందరు సముద్ర స్నానాలు చేస్తూ.. మరి కొందరు ఇసుక తెన్నెల్లో ఆటలు ఆడుతూ సరదాగా గడిపారు. పర్యాటకులు ఎక్కువగా రావ డంతో పార్కింగ్ స్థలాలు వాహనాలతో కిక్కిరిసిపోయాయి. బీచ్‌లో మంచినీటి సదుపాయం లేక సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు.

కోడి రామ్మూర్తికి నివాళి



రామ్మూర్తినాయుడు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న వాకర్స్ సభ్యులు

మధురవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కలియుగ భీముడు కోడి రామ్మూర్తినాయుడు మల్ల యుద్ధంలో తెలుగు జాతికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చారని పలువురు కొనియాడారు. మధురవాడ శిల్పారామంలో ఆదివారం జాతర వాకర్స్ అసోసియేషన్, డ్రాగన్ ఫిట్‌నెస్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో రామ్మూర్తినాయుడు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు పెదిరెడ్ల కనకారావు, సత్యనారాయణ మాట్లాడుతూ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వీరఘట్టం గ్రామానికి చెందిన రామ్మూర్తి నాయుడు మల్ల యుద్ధ విద్యలో ఆరితేరిన వీరుడని చెప్పారు. రెండుసార్లు ప్రపంచ రికార్డు నెలకొల్పి, ఇండియన్ హెర్క్యులెస్, ప్రపంచ వీరుడు తదితర బిరుదులు పొందారని తెలిపారు. రైలు ఇంజన్‌ను ఒంటి చేతితో ఆపడం, రెండు కార్లను రెండు చేతులతో నిలపడం వంటి విన్యాసాలు అప్పట్లో అబ్బురపరిచాయన్నారు. అనంతరం వాకర్స్ సభ్యులు రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

జోరుగా టీడీపీ సభ్యత్వాల నమోదు




భీమిలిలో సభ్యత్వం తీసుకున్న వారితో నూకరాజు, తదితరులు

ఎండాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నాయకులు, కార్యకర్తలు టీడీపీ సభ్యత్వాలను అధిక సంఖ్యలో నమోదు చేయించాలని 8వ వార్డు పార్టీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి పిలుపునిచ్చారు. ఆదివారం ఎండాడ ఎస్సీ కాలనీలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్కరబోయిన రాంబాబు, చెట్టుపల్లి సన్యాసిరావు, దువ్వి పరమేశ్, ఒమ్మి బాబూరావు, దొరబాబు, శ్రీను, మంగాదేవి పాల్గొన్నారు.

భీమునిపట్నం : టీడీపీలో సభ్యత్వం పొందేందుకు యువత ఉత్సాహం చూపుతున్నారని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, 3వ వార్డు అధ్యక్షుడు గంటా నూకరాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచన మేరకు పట్టణంలో అత్యధిక సభ్యత్వ నమోదుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

పాత కేసులో నిందితుడికి రిమాండ్

భీమునిపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఒక డెకాయిట్ కేసులో పోలీసుల కళ్లుగప్పి తప్పించుకు తిరుగుతున్న నిందితుడు వాసుపల్లి జగదీశ్‌ను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్‌కు తరలించారని ఆదేశించారు. సీఐ బి. సుధాకర్ తెలిపిన వివరాలు ప్రకారం..పట్టణంలోని ఎగువపేటకు చెందిన జగదీశ్ ఎంతో కాలంగా ఒక కేసులో తప్పించుకు తిరుగుతున్నాడు. ఎస్ఐ హరీష్, కానిస్టేబుళ్లు కనకారావు, అప్పారావు అతన్ని ఆదివారం అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు.



ఎండాడలో భవానీ సమేత కైలాసగిరీశ్వర ఆలయం, స్వామివారు



భీమిలిలో లైటింగ్‌తో ఉన్న చోడేశ్వరాలయం

కార్తీక పూజలకు శివాలయాలు ముస్తాబు

విశాలాక్షినగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 8, 9 వార్డుల పరిధిలోని శివాలయాలు కార్తీక మాసోత్సవాలకు ముస్తాబయ్యాయి.కైలాసగిరికి వెళ్లే మార్గంలో ఉన్న భవానీ సమేత కైలాస గిరీశ్వరస్వామి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం వేకువజాము నుంచి ఇక్కడి స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నారు. ఎండాడలోని పశుపతినాథేశ్వర స్వామి ఆలయంలోనూ భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

భీమునిపట్నం :పట్టణంలోని శివాలయాలను కార్తీక పూజలకు సిద్ధం చేశారు. పురాతన శ్రీ భ్రమరాంబికా సహిత చోడేశ్వరస్వామి ఆలయం, కాత్యాయిని సహిత భీమేశ్వరాలయం, బాలాత్రిపుర సుందరి సహిత చంద్రశేఖర ఆలయం, నేరేళ్లవలస జంక్షన్‌లోని శివాలయంతో పాటు రుక్మిణి సత్యభామ సహిత వేణుగోపాల స్వామి ఆలయం, జగన్నాథ ఆలయం, లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాలను రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఇనాం భూముల సమస్య పరిష్కరించాలి : సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు గంగారామ్

పద్మనాభం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇనాం భూముల సమస్యను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డాక్టర్ గంగారామ్ కోరారు. ఆదివారం పద్మనాభంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో దీర్ఘకాలంగా ఉన్న ఇనాం భూముల సమస్యను పరిష్కరించి, రైతులను ఆదుకోవాలన్నారు. అలాగే రైతాంగానికి సాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం భీమిలి జోన్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ కార్యదర్శిగా ఆర్ఎస్ఎన్ మూర్తి, సభ్యులుగా నరసింగరావు, నాగరాణి, అప్పలనాయుడు, సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో నాయకులు నాగరాణి, బి. పద్మ, రవ్వా నరసింగరావు, అప్పలనాయుడు, రాము పాల్గొన్నారు.

టీచర్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు 6 వరకు గడువు

పద్మనాభం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీకి అర్హులైన ఉపాధ్యాయులు ఈనెల 6వ తేదీలోగా ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలని తహసీల్దారు ఆనందరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లుగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గత మూడేళ్ల పైగా పని చేస్తున్న ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఇందుకు అవసరమైన ఫారం-19 దరఖాస్తులు విద్యాశాఖాధికారి, తహసీల్దారు కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు.

ఎడాపెడా ట్రాఫిక్ చలానాలు

... 5వ పేజీ తరువాయి

నెలల్లోగా చెల్లించకుంటే హెచ్చరిక మెసేజ్‌లు పంపుతున్నారు. అయితే ఎందుకు జరిమానా వేశారో అందులో పేర్కొనడం లేదు. సీతమ్మధార రైతుబజారు రోడ్డు మొత్తం ఆక్రమణలే. పార్కింగ్‌లో దుకాణాలు ఏమిటని ఎవరూ ప్రశ్నించరు. అసలు ఆ ప్రాంతంలో పోలీసులే కనిపించరు. కానీ ఫొటోలు తీసి చలాన్లు పంపుతున్నారు.

మెసేజ్‌లలో డొల్లతనం

గతంలో ట్రాఫిక్ చలానా జారీచేస్తే ఏ నిబంధన ఉల్లంఘించారో ఆ ఫొటో పంపించేవారు. సిగ్నల్ జంపింగ్, నో పార్కింగ్, నో హెల్మెట్ ఇలా వివరాలుండేవి. తాజాగా పంపే చలానా మెసేజ్‌ల్లో ఏ వివరాలూ కనిపించడం లేదు. చలానా నంబరు తప్ప కారణం పేర్కొనడం లేదు. వారు పంపించే లింక్ సరిగ్గా ఓపెన్ కావడం లేదు. ఒకసారి ఓపెన్ అయితే రెండోసారి ఓపెన్ కాదని చెబుతున్నారు. సరైన విధానం లేకుండా సిటీ పోలీసులు వ్యవహరిస్తున్న తీరు ఆక్షేపణీయంగా ఉందని, దానిని మార్చుకోవాలని కోరుతున్నా రు. నగరంలో ముందుగా పార్కింగ్ స్థలాలను ఖాళీ చేయించి, అవసరమైన చోట పార్కింగ్ సదుపాయం కల్పిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందంటున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఊరట

... 5వ పేజీ తరువాయి

ఆయా కేంద్రంలో కార్యకర్తలు, చిన్నారులకు సమస్యలు తీరనున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా అనేక అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస అవసరాలైన మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం లేవు. దీనిని గుర్తించిన కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాల్సిన పనుల జాబితాలో వీటిని చేర్చింది. ఈ మేరకు నిధులను కేటాయించింది. ఇందులో భాగంగా జిల్లాకు సుమారు రూ.31 లక్షలు విడుదల చేసింది. జిల్లాలో 776 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, వాటిలో సొంత భవనాలుండి మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం లేని కేంద్రాలకు నిధులు అందిస్తోంది.

వసతుల కల్పనే ధ్యేయం

జిల్లాలోని 52 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టేందుకు ఒక్కో కేంద్రానికి రూ.36 వేలు చొప్పున రూ.18,72,000 మంజూరుచేసింది. మరో 74 కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు వీలుగా రూ.12,58,000 మంజూరు చేసింది. ఈ పనులు చేపట్టే బాధ్యతను గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు, నగర పరిధిలో జీవీఎంసీ అధికారులకు అప్పగించింది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనులు ప్రారంభం కాగా, అన్ని కేంద్రాల్లో వచ్చే నెలాఖరుకు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. వైసీపీ హయాంలో నాడు-నేడు పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు భవన నిర్మాణ పనులను కాంట్రాక్టర్లకు అప్పటించారు. చాలాచోట్ల పనులు చేసినా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదు. ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు చుట్టూ తిరిగినా ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. కూటమి అధికారంలోకి వచ్చాక, ముందుగానే నిధులు విడుదల చేస్తోంది. దీంతో కాంట్రాక్టర్లు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు.

చోరీల నియంత్రణపై కనిపించని కార్యాచరణ?

... 5వ పేజీ తరువాయి

టవర్స్‌లోని ఒక ఫ్లాట్‌లో ఇంటి యజమాని అయిన వైద్యురాలి నల్లపూసల హారం చోరీకి గురైందని ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై దర్యాప్తు చేసిన పోలీసులు అనుమానితురాలిని విచక్షణరహితంగా కొట్టడంతో ఆమె కాలు విరిగి వివాదానికి దారితీసింది. ఈ ఘటనలో బాధ్యుడైన ఎస్ఐ జగదీశ్‌ను సీపీ సస్పెండ్ చేశారు. ఇటీవల నగరంలో రాత్రిపూట చోరీలు జరుగుతుండడంతో నగరవాసులు ఆందోళనకు గురవుతున్నారు. దీనికి అడ్డుకట్టవేయడంపై సీపీ శంఖబ్రత బాగ్చి దృష్టిసారించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, లేదంటే చోరీలకు అడ్డుకట్ట పడదని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు.

దుకాణం.. వివాదం!

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటుచేశారు. అక్కడకు 95 మీటర్ల దూరంలో నర్సింగ్ కాలేజీ ఉంది. దీంతో అక్కడ దుకాణం పెట్టడానికి వీల్లేదని ఎక్సైజ్ శాఖలోని కీలక అధికారి ద్వారా సమీపంలోని బార్ యజమాని అడ్డుపడ్డారు. అయితే గతంలో అదే భవనంలో ప్రభుత్వ మద్యం దుకాణం నడిచేది. ఏడాదికి సుమారు రూ.22 కోట్లు విక్రయాలు జరిగేవి. ఇప్పుడు అదే భవనంలో ఏర్పాటుకు అధికారులు అభ్యంతరం చెప్పడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గుడికి వంద మీటర్లు దూరంలో మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వకూడదు. కానీ నగరంలోని ఓ ప్రముఖ మద్యం వ్యాపారి సీతమ్మధార షిర్డీసాయిబాబా ఆలయానికి 20 మీటర్లు దూరంలోనే దుకాణం ఏర్పాటుచేసినా అధికారులు అడ్డుచెప్పలేదు. అలాగే సీతమ్మధారలోనే ఏఎంజీ ఆస్పత్రికి 85 మీటర్లు దూరంలో దుకాణం ఏర్పాటుచేశారు. ఇది ఒక ప్రజా ప్రతినిధి అనుచరుడిది కావడంతో చర్యలు లేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కెప్టెన్ రామారావు జంక్షన్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డులో ఒకేచోట రెండు మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఒక దుకాణం యజమాని ఎక్సైజ్ శాఖలోని కీలక అధికారిని ప్రసన్నం చేసుకుని పక్కనే ఉన్న దుకాణాన్ని మార్పించాలని కోరారు. దీంతో ఆ అధికారి సిబ్బందిని పంపి ఒకేచోట రెండుంటే గొడవలు జరుగుతాయని, మరోచోటుకు మార్చుకోవాలని చెప్పించారు. కాదంటే కక్ష కట్టి కేసులు రాసి, లైసెన్స్ రద్దుచేసి వేధిస్తారనే భయంతో ఆ యజమాని వేరొకచోట షాపును వెతుక్కునే పనిలో పడ్డారు. దీనిపై టీడీపీకి చెందిన నాయకుడికి బాధిత వ్యాపారులు మొరపెట్టుకోగా ఎక్సైజ్ శాఖలోని కీలక అధికారికి ఫోన్ చేస్తే...కొంతమంది ప్రజాప్రతినిధుల సూచన మేరకే అలా చేయాల్సి వచ్చిందని చెప్పినట్టు సమాచారం. భూపేష్‌నగర్, వడ్లపూడిలో మద్యం దుకాణాల ఏర్పాటుకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనల వెనుక కొంతమంది బార్ నిర్వాహకుల ప్రమేయం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి.

ఆరోగ్యశాఖలో ఎఫ్ఆర్ఎస్

... 5వ పేజీ తరువాయి

వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో సుమారు 1,500 మంది పనిచేస్తున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ అండ్‌వెల్‌నెస్ సెంటర్లు, అర్బన్‌హెల్త్ సెంటర్స్‌లో ఉద్యోగులు తీరుబడిగా రావడం, మధ్యాహ్నం వేగంగా వెళ్లిపోవడంతో మెరుగైన వైద్యసేవలు అందడం లేదన్న ఫిర్యాదులున్నాయి. వీటిపై దృష్టిసారించిన ఉన్నతాధికారులు ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని పటిష్ఠంగా అమలు చేయడం ద్వారా మాత్రమే చెక్ చెప్పేందుకు అవకాశం ఉంటుందని భావించారు. ఇందుకోసం ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించారు.

కొత్త ఏడాదిలో మిగిలిన ఉద్యోగులకు..

ఆరోగ్యశాఖలోని మిగిలిన ఉద్యోగులకు దీనిని వచ్చే సంవత్సరం నుంచి వర్తింపజేయనున్నారు. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలందాయి. ఎఫ్ఆర్ఎస్ యాప్ డౌన్లోడ్ చేసుకుని పనిచేసే కేంద్రానికి వచ్చినప్పుడు లాగిన్ కావాలి. సాయంత్రం వెళ్లినప్పుడు ముఖ హాజరు ద్వారా లాగ్ అవుట్ చేయాలి.

ముగిసిన విజిలెన్స్ వారోత్సవాలు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిర్మూలన కోసం అందరూ తమ బాధ్యతగా వ్యవహరించాలని ఎన్‌ఎస్ టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ విజిలెన్స్ వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఆదివారం ప్లాంట్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన ఉక్కు సీవీవో కరుణరాజు, డైరెక్టర్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ అవినీతిని అరికట్టడంలో పారదర్శకత, డిజిటలైజేషన్ వంటి అంశాలపై స్టీల్‌ప్లాంట్ చేస్తున్న కృషి విశేషమైందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎస్‌ఆర్‌వీజీకే గణేశ్ (ఫైనాన్స్), జీవీఎన్ ప్రసాద్ (కమర్షియల్), అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'డెయిరీ'లో కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని నిరసన

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీలో 28 మంది కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలన్న కోర్టు తీర్పును యాజమాన్యం అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఆదివారం వారు సంస్థ మెయిన్ గేటు వద్ద నిరసన తెలిపారు. 2005లో 28 కాంట్రాక్టు కార్మికులను అకారణంగా యాజమాన్యం తొలగించడంతో వారు కోర్టును ఆశ్రయించగా, 2017లో ట్రిబ్యునల్ వారిని పర్మినెంట్ చేయాలని ఆదేశించింది, అయినా డెయిరీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం దారుణమని విశాఖ డెయిరీ కాంట్రాక్టు లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వరదాడ వెంకటరమణ, అధ్యక్షుడు గోకా సోములు ఆవేదన వ్యక్తం చేశారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆశయాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి పరిచే సత్తా సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి మాత్రమే ఉందని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. తుంగ్లాంలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.సింహాచలం, వి.వరహాలు, అచ్చిబాబు, పాపారావు, జి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే అక్కిరెడ్డిపాలెంలో సభ్యత్వ నమోదును తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి ప్రారంభించారు.

ఆలోచనలకు పదును పెట్టే పోటీ పరీక్షలు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలతో విద్యార్థులు ఆలోచనలకు పదును పెట్టవచ్చని స్టీల్ ప్లాంట్ సీజీఎం (వర్క్స్) యు.శ్రీధర్ అన్నారు. స్టీల్ క్లబ్‌లో ఆదివారం మ్యాథ్స్ టూబి మెరిట్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అబాకస్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రాచీన గణిత శాస్త్రం ఆధారంగా అబాకస్ ద్వారా విద్యార్థులను తీర్చిదిద్దడం గొప్ప విషయమన్నారు. సంస్థ ఎండీ సుధారాణి, ప్రతినిధులు ఈపూరి బుచ్చిరాజు, వైకే గార్గ్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

సినిమా గైడ్

- **వీనమ్ :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)
- **పొట్టేల్ :** వెంకటేశ్వర, సంగం, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎంతపనిచేసావ్ చంటి :** వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **లగ్గం :** విశేష్ (గాజువాక), తాతా (తగరపువలస)
- **దేవర :** జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **వేట్టయాన్ :** సంగం, గోకుల్, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **విశ్వం :** శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, హెవెన్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 44, టమాటా 36, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 28, పచ్చిమిర్చి 48 కాకరకాయలు 42, బీరకాయలు 38, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 44, దొండకాయలు 32, బంగాళదుంపలు 32, అరటికాయ (పెద్ద) 7, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది) 60, బరబాటి 40, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 46, దోసకాయలు 38, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 120, పొటల్స్ 42, కీరదోస 28, క్యాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 30, కంద 72, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	110
ఫారం ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240



కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న గాజువాకలోని మహిళా రైతు బజారు



వెలవెలబోతున్న గాజువాకలోని ప్రధాన చేపల మార్కెట్

ఇటు కళకళ.. అటు వెలవెల!

» కార్తీకం ఎఫెక్ట్‌తో కిటకిటలాడుతున్న కాయగూరల మార్కెట్లు » బాగా తగ్గిన మాంసం, చేపల విక్రయాలు

గాజువాక, నవంబరు 3: కార్తీక మాసం ప్రభావం ఇటు కూరగాయల అమ్మకాలపై.. అటు మాంసం, చేపల విక్రయాలపై బాగా పడింది. ఒకపక్క కార్తీకం, మరోపక్క అయ్యప్ప స్వామి భక్తులు అధికంగా ఉండడం వల్ల ఈ నెల మొత్తం ఎక్కువ శాతం మంది శాఖాహారమే తీసుకుంటారు. దీంతో మాంసాహార విక్రయాలు గణనీయంగా పడిపోగా, కూరగాయలు, ఆకుకూరల అమ్మకాలు అమాంతం పెరిగిపోయాయి. సాధారణంగా ఆదివారం పూట ఎక్కువ మంది మాంసాహారాన్ని తీసుకుంటారు. అందువల్ల మాంసం, చేపల మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడుతూ రద్దీగా కనిపిస్తుంటాయి. అటువంటిది కార్తీక మాసం ఆరంభం కావడంతో ఈ ఆదివారం మాంసం, చేపల మార్కెట్లలో కొనుగోలుదారుల తాకిడి అంతగా లేక వెలవెలబోయాయి. కార్తీక మాసం ఎఫెక్ట్‌తో చేపలు, మాంసం అమ్మకాలు బాగా తగ్గిపోయాయని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రద్దీగా కూరగాయల మార్కెట్లు

గాజువాక ప్రధాన కూరగాయల మార్కెట్, మహిళా రైతు బజారు, రాజీవ్ రోడ్డులోని మార్కెట్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఉన్న కూరగాయల మార్కెట్లు ఉదయం నుంచే కొనుగోలుదారులతో రద్దీగా కనిపిస్తున్నాయి. కాగా ఉదయం ఎనిమిది గంటల్లోపే చాలా కూరగాయలు అమ్మకమైపోతున్నాయని పలువురు కొనుగోలుదారులు చెబుతున్నారు. దీనికి తోడు కూరగాయల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయని, రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కార్తీక పూజలకు బ్రహ్మసూత్ర శివలింగం సిద్ధం

కూర్మన్నపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడిలో శ్రీసీతారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఇటీవల తొలిసారిగా ఉత్తరాంధ్రలో ఎక్కడా లేని బ్రహ్మసూత్ర శివలింగాన్ని ప్రతిష్ఠించారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయ, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని కార్పొరేటర్ బొండా జగన్ అన్నారు. బ్రహ్మసూత్ర శివలింగంతో పాటు పంచ ముఖ వినాయకుడు, శ్రీవల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, సీతారామాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, నవగ్రహ మండపం, నూతన ధ్వజ స్తంభం, నాగబంధాల ప్రతిష్ఠతో ఈ ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతుందన్నారు. కార్తీక తొలి సోమవారం ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. కాగా ఈ నెల 11న విశేష పూజలు, 15న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని జ్వాలాతోరణం, 18న శిఖర దీపారాధన, డిసెంబరు ఒకటిన రుద్రాభిషేకం, అన్న సమారాధనను చేపడతామని బొండా జగన్ తెలిపారు.



వడ్లపూడిలోని బ్రహ్మసూత్ర శివలింగం

ఘనంగా లూథరన్ చర్చి స్వర్ణోత్సవం



అక్కిరెడ్డిపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): షీలా నగర్ ప్రధాన రహదారిలో ఉన్న హయ్యర్ మెమోరియల్ లూథరన్ చర్చిని స్థాపించి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం స్వర్ణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి అభివృద్ధి సంఘం ప్రతినిధులు విజయ్‌కుమార్, జి.రవికుమార్‌లు 'లూథరన్' అభివృద్ధికి కృషి చేసిన సభ్యులను ఘనంగా సత్కరించారు.

'ఉక్కు పరిరక్షణకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి'

కూర్మన్నపాలెం నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కూటమి ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు గణపతిరెడ్డి కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,361వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ కోసం ఎలాంటి త్యాగాలకైనా వెనుకాడబోమన్నారు. ఉక్కు కర్మాగారం కోసం భూములిచ్చిన నిర్వాసితులకు ఇప్పటికీ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటును కాపాడుకోవాల్సిన బాధ్యత తెలుగు ప్రజలందరిపై ఉందన్నారు. ఉక్కును సెయిల్‌లో విలీనం చేస్తేనే సమస్య పరిష్కారమవుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

తీగ తెగితే.. తాగునీటికి కటకట

» పారిశ్రామిక ప్రాంతంలో తరచూ విద్యుత్ సమస్యలు
» ఎప్పటికప్పుడు నీటి సరఫరాకు అంతరాయం
» పంప్‌హౌస్ వద్ద మరమ్మతుకు గురైన జనరేటర్లు
» పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



పారిశ్రామిక ప్రాంత తాగునీటి సరఫరా కేంద్రం

మల్కాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక ప్రాంతంలో నీటి సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతుండడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఇటీవల ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోతుండడం, తీగలు తెగిపడడంతో నీటి సరఫరా బంద్ అవుతోంది. శనివారం రాత్రి రామకృష్ణపురం వద్ద ఉన్న జీవీఎంసీ పంప్‌హౌస్‌కు మంచి నీటి పంపింగ్ జరుగుతుండగా, ఓ విద్యుత్ తీగ తెగడంతో పంప్‌హౌస్‌కు మంచినీటి పంపింగ్ నిలిచిపోయింది. దీంతో ఆదివారం మల్కాపురం, ప్రకాశ్ నగర్, జనతా కాలనీ, ఇండస్ట్రియల్ కాలనీతో పాటు పలు గ్రామాలకు మంచినీటి సరఫరా నిలిచిపోయింది. ఆ ప్రాంతాలకు ప్రతిరోజు ఉదయం ఆరు నుంచి ఎనిమిది గంటల మధ్య తాగునీరు సరఫరా అవుతుంది. అయితే ఎప్పటిలాగే ఆయా ప్రాంతవాసులు తాగునీటి సరఫరా కోసం ఎదురు చూస్తుండగా ఎనిమిది దాటినా నీరు సరఫరా కాకపోవడంతో కొందరు జీవీఎంసీ అధికారులకు ఫోన్ చేసి ఆరా తీశారు. అప్పుడు గాని విద్యుత్ తీగ తెగిన వైనం గురించి తెలియలేదు. తమ ప్రాంతంలో ఈ సమస్య ఇటీవల తరచూ ఎదురవుతోందని స్థానికులు అంటున్నారు. ముందస్తు సమాచారం లేకపోవడం, ఆదివారం నీటి సరఫరా లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడ్డామని వాపోయారు.

గతంలో పంప్ హౌస్‌ల వద్ద జనరేటర్లు ఏర్పాటు చేశారు. అయితే అది మూన్నాళ్ల ముచ్చటే అయింది. ఆ జనరేటర్లు మరమ్మతులకు గురవగా, వాటిని పట్టించుకోకపోవడంతో అలంకారప్రాయంగా మిగిలాయి. వీటి వల్ల ఉపయోగం లేకపోగా, జీవీఎంసీ ఖర్చు మిగిలింది. ఈ జనరేటర్లను పట్టించుకునే వారే లేరు. దీంతో విద్యుత్‌కు అంతరాయం కలిగే ప్రతిసారి తాగునీటి సరఫరా జరగడం లేదు. ఈ సమస్యపై జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవలని పారిశ్రామిక ప్రాంతవాసులు కోరుతున్నారు.

శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీగా కృష్ణకుమార్



వేపగుంట నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన 172వ ట్రస్ట్ బోర్డు సమావేశంలో నాయుడు తోట శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీగా ఆస్పత్రి వ్యవస్థాపకుడు ఆత్మకూరి శంకర్రావు పెద్ద కుమారుడు కృష్ణకుమార్‌ను నియమించినట్టుశంకర్ ఫౌండేషన్ డీజీఎం కె.బంగార్రాజు ఇక ప్రకటనలో తెలిపారు. ఈ ట్రస్ట్‌బోర్డు సమావేశం బోర్డు చైర్మన్ ఎం.రాందాస్ అధ్యక్షతన సభ్యులు ఎ.విజయ్‌కుమార్, ఎ.కృష్ణకుమార్, ఎ.ప్రసన్న కుమార్ పాల్గొని ఏకాభిప్రాయంతో నిర్ణయం తీసుకున్నట్టు తెలియజేశారు. ట్రస్టీగా ఎంపికైన కృష్ణకుమార్ ఆంధ్ర యూనివర్సిటీ నుంచి అప్లైడ్ ఎకనామిక్స్‌లో మాస్టర్ డిగ్రీ, శంకర్ ఫౌండేషన్ బోర్డులో గత 13 సంవత్సరాలు పనిచేసిన అనుభవం ఉంది. కృష్ణకుమార్ నియామకం పట్ల సంస్థలో డాక్టర్లు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

పూజలకు శివాలయాలు సిద్ధం

వేపగుంట నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నాయుడుతోట, వేపగుంట, ప్రహ్లాదపురం పరిసర ప్రాంతాల్లో ఉన్న శివాలయాలు కార్తీక తొలి సోమవారం వేడుకలకు ముస్తాబు అయ్యాయి. నాయుడుతోట కృష్ణానగర్ గుడి వీధిలో దుర్గామల్లేశ్వరాలయం, రవినగర్ శివాలయం, వేపగుంట కొండపై ఉన్న శివాలయం, ముత్యాలమ్మ ఆలయం, ప్రహ్లాదపురం ఉమా రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించేందుకు భక్తులు రద్దీకి తగినట్టుగా ఆయా ఆలయాల కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మందుబాబులతో మహా ఇబ్బందులు

» కొత్తగా వైన్‌షాప్ ఏర్పాటుతో కొత్తపాలెం అండర్‌పాస్‌వే కూడలి వద్ద మకాం
» రాకపోకలకు తప్పని ఇబ్బందులు » పట్టించుకోని పోలీసులు



రహదారిపై వాహనాలు నిలపడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ఇతర వాహనదారులు

గోపాలపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పది గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిలో రహదారిపై వాహనాలు నిలిపి మందుబాబులు వాహనరాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు స్పందించకపోవడంతో నిత్యం ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. స్థానిక కొత్తపాలెం అండర్‌పాస్‌వే కూడలిలోని మద్యం దుకాణానికి వచ్చే మందుబాబులు రహదారిపైనే వాహనాలు ఇష్టారాజ్యంగా నిలిపివేస్తున్నారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. సుమారు పది గ్రామాలకు ఈ కూడలి ప్రధాన కేంద్రం. ఈ మార్గం నుంచే భారీ వాహనాలు కూడా రాకపోకలుసాగిస్తుంటాయి. అయితే మద్యం దుకాణానికి వచ్చే మందుబాబులు రోడ్డుకు అడ్డంగా వాహనాలు పార్కింగ్ చేసి రహదారిలో వాహన రాకపోకలకు అంతరాయం కలిగించడంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొద్ది రోజుల క్రితం వరకూ చీకటి పడితే సుమారు ఐదుగురు ట్రాఫిక్ పోలీసులు ఈ ప్రాంతంలో డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసేవారు. దీంతో అండర్‌పాస్‌వే కూడలిలోకి వెళ్లాలంటే మందుబాబులు బెంబేలెత్తిపోయేవారు. అయితే ఇటీవల కొత్త మద్యం దుకాణాలు వచ్చిన తరువాత ఈ ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులు కూడా కనిపించడం లేదు. దీంతో మందుబాబులు మరింత చెలరేగిపోతున్నారు. దీనిపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి అండర్‌పాస్‌వే కూడలిలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపైనే వాహనాలు నిలిపి మందుబాబుల ముచ్చట్లు

అయ్యప్ప ఆలయంలో నిత్యాన్న సమారాధన ప్రారంభం



అన్న సమారాధనను ప్రారంభిస్తున్న తిప్పల నాగిరెడ్డి, గురుమూర్తిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): షీలానగర్ అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా 20 ఏళ్లగా నిర్వహిస్తున్న నిత్యాన్న సమారాధనను ఆదివారం మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. ఆలయ ప్రధాన నర్చకులు కృష్ణన్ నంబూద్రి ఆధ్వర్యంలో వేదపండితులు అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకించాక ప్రత్యేక పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధనను మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తిరెడ్డిలు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్తలు తిప్పల నితీశ్‌రెడ్డి, సతీశ్‌రెడ్డితో పాటు తిప్పల దేవన్‌రెడ్డి, ధర్మాల శ్రీను, ఆలయ కమిటీ సభ్యులు ఎస్‌ఏ నాయుడు, పి.భూలిరాజు, మురళీశ్వరరావు, రవిబాబు, జి.మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలంటూ మహిళా సమాఖ్య ఆందోళన

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ మహిళా సమాఖ్య అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి బూసి పరమేశ్వరి డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం స్టీల్‌ప్లాంట్ రైతుబజారు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల ఉల్లిపాయల లోడ్‌లతో వందల కొద్దీ లారీలు కర్నూలు మార్కెట్ వద్ద బారులుతీరాయని, కిలో ఐదు రూపాయలకు కూడా కొనేందుకు వ్యాపారులు ముందుకు రాలేదని, కానీ బహిరంగ మార్కెట్‌లో మాత్రం కిలో యాభై రూపాయలకు తగ్గకుండా విక్రయిస్తుండడం దారుణమన్నారు. అలాగే బియ్యం, పప్పులు, నూనెలు.. ఇలా అన్ని రకాల వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని, వీటి నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు కె.తులసి, కొలివలస లక్ష్మి, రమణమ్మ, కింజిరి రమ్య, తదితరులు పాల్గొన్నారు.

కుడో పోటీల క్రీడాకారులకు అభినందనలు

అగనంపూడి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక హరికృష్ణ ఫిట్‌నెస్ జోన్ క్రీడాకారులు గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో ఈ నెల ఐదు నుంచి 11వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి కుడో పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కరణంరెడ్డి నరగసింగరావు అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించి పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు సత్యనారాయణ, కుడో అసోషియేషన్ ప్రతినిధులు అనురాధ, రవిబాబు, శివకాశీరావు, కోటిరెడ్డి, నాగయశ్వంత్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల బాలుడికి అరుదైన శస్త్ర చికిత్స

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రెండు నెలల బాలుడికి ఎక్మోతో అరుదైన గుండె శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు కిమ్స్ ఐకాన్ కడల్స్ వైద్యులు. షీలానగర్ కిమ్స్ ఐకాన్ వైద్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన రెండు నెలల బాలుడిని గుండె సమస్యతో కారణంగా షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి గత వారం తీసుకువచ్చారు. బాలుడికి శుద్ధి చేసిన రక్తం గుండె కుడివైపు కర్ణికలోకి వెళ్లి చెడు రక్తంలో కలవడాన్ని గుర్తించిన వైద్యులు మూడు రోజుల పాటు అత్యంత క్లిష్టమైన ఎక్మో పెట్టారు. ఆ తర్వాత వైద్యులు నిఖిల్ తెన్నేటి, రౌతు సంతోశ్ కుమార్‌లు తమ బృందంతో బాలుడికి గుండె శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. తమ కుమారుడి ప్రాణాలను కాపాడిన వైద్యులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నారులకు నేత్ర వైద్య పరీక్షలు

అగనంపూడి, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): అగనంపూడి శివారు శ్రీనివాస నగర్‌లో స్థానిక విజన్ కేర్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు ఉచితంగా నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక నాయకుడు బి.సత్యనారాయణ ఈ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో విజన్ కేర్ అందిస్తున్న సేవలు అభినందనీయమైన వన్నారు. అనంతరం పలువురు చిన్నారులకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్య క్రమంలో విజన్ కేర్ ప్రతినిధి శివకుమార్, సుజాత, స్థానిక నాయకులు సింహాచలం, చందూరమేశ్, రుద్రకుమార్, త్రినాథ్, హనిత, తదితరులు పాల్గొన్నారు.

జనతా కాలనీలో పైలట్ వాటర్ స్కీమ్ ప్రారంభం



పైలట్‌వాటర్ స్కీమ్ పథకం ప్రారంభిస్తున మజ్జి సోమేష్

మల్కాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 61వ వార్డు జనతాకాలనీలో ఆదివారం పైలట్ వాటర్ స్కీమ్ పథకాన్ని టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం వల్ల ఈ ప్రాంతం లో మంచినీటి సమస్యకు కొంత ఉపశమనం కలుగుతుందన్నారు. ఏవైనా కారణాలతో జీవీఎంసీ ద్వారా మంచినీటి సరఫరా జరగనప్పుడు ఈ పైలట్ వాటర్ స్కీమ్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. దీన్ని ప్రజలందరూ సక్రమంగా ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు ప్రధాన కార్యదర్శి గండిబోయిన జయశంకర్, జనసేన నాయకులు చంద్రమౌళి, సీనియర్ నాయకులు కోటి, టీఎన్‌టీయూసీ నాయకులు కన్నారావు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

అండర్‌పాస్‌వేలలో నిత్యం నీటి ఊటలు

» చిత్తడిగా ఉండడంతో పాదచారులు, వాహనదారులకు తప్పని ఇబ్బందులు



నీటి ఊటలతో చిత్తడిగా మారిన చంద్రనగర్ అండర్‌పాస్‌వే



అండర్‌పాస్ రిటైనింగ్ వాల్‌ల నుంచి చిమ్ముతున్న నీటి ఊటలు

గోపాలపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రైల్వేశాఖ నిర్మించిన అండర్‌పాస్‌వేలలో నిత్యం నీటి ఊటలు ఉంటున్నాయి. దీంతో వాహన చోదకులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. గోపాలపట్నం దిగువ ప్రాంతాల ప్రజలు రైల్వే లెవెల్ క్రాసింగ్ సమస్యతో ఇబ్బందులు పడటంతో ఇటీవల పాతగోపాలపట్నం, చంద్రనగర్ ప్రాంతాల్లో రెండు అండర్‌పాస్‌వేలు నిర్మించారు. అయితే ఈ అండర్‌పాస్‌వేల్లో అన్ని వేళల్లోనూ నీటి ఊటలు పెల్లుబుకుతుండడంతో నిత్యం చిత్తడిగా ఉంటుంది. దీంతో ఈ మార్గం నుంచి రాకపోకలు సాగించే వాహన చోదకులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రక్షణ రంగ ఉద్యోగుల పిల్లలకు ఉపకార వేతనాలు అందజేత



వైజాగ్ సీపోర్ట్ ఎండీ రాగం కిషోర్ నుంచి స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులు, తదితరులు

ఎన్‌ఏడీ జంక్షన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చదువుల్లో ప్రతిభ చూపిన రక్షణ రంగ ఉద్యోగుల పిల్లలకు ఆదివారం జీవీఎంసీ 90వ వార్డు కాకానీనగర్ కేటీబీ సంఘ భవనంలో ప్రోత్సాహక స్కాలర్ షిప్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైజాగ్ సీపోర్ట్ ఎండీ, పినాకిల్ ఆస్పత్రి చెర్మన్ రాగం కిషోర్ మాట్లాడుతూ రక్షణ రంగంలో పని చేయటమే దేశానికి గర్వకారణమైతే.. సేవచేయటంలో ఆయా ఉద్యోగులు కూడా ముందుండటం ఎంతో గొప్ప విషయమన్నారు. పదో తరగతి నుంచి ఇంజనీరింగ్, జేఈఈ, నీట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా మెడికల్ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ సుధాకర్, గంట్ల శ్రీనుబాబు, చిరంజీవి, భాస్కరరావు, 'జబర్దస్త్' ఫేమ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

క్షేమ కాళీమాతను దర్శించుకున్న సీపీ



అమ్మవారికి పూజ చేస్తున్న పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

అక్కయ్యపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైల్వేన్యూకాలనీలో జరుగుతున్న క్షేమ కాళీమాత పూజ మహోత్సవాల్లో భాగంగా అమ్మవారిని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ ఆదివారం దర్శించుకొని పూజలు చేశారు.

అయ్యప్పమాలధారులకు నేటి నుంచి అన్నప్రసాద వితరణ

అక్కయ్యపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా అయ్యప్పమాలధారులకు సోమవారం నుంచి అన్న సమారాధన కార్యక్రమాన్ని రైల్వే ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరం ఆవరణలో నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. ధ్యానమందిరంలో 2010లో కేవలం 20 మందితో ప్రారంభించిన నిత్యాన్నప్రసాదం పంపిణీలో ప్రస్తుతం వందలాది మంది భక్తులు, పేదలు, యాచకులు పాల్గొంటున్నారన్నారు.

ఏఎస్‌నగర్‌లో అగ్నిప్రమాదం



బాధితురాలికి ఆర్థిక సహాయం అందిస్తున్న గంకల అప్పారావు

కంచరపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 48వార్డు పరిధి అల్లూరి సీతారామరాజు నగర్‌లో ఆదివారం ఓ ఇంటిలో అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికంగా నివాసం ఉంటున్న వెంకటలక్ష్మి అనే మహిళ పూజ చేసుకుని దీపం వెలిగించి అనంతరం బజారుకని బయటకు వెళ్లింది.. దీపపు మంట సమీపంలోని జోర్ కర్టెన్‌కు తగిలి మంటలు రాజుకోవడంతో ఇంటినిండా వ్యాపించాయి. ఇంటిలో నుంచి దట్టమైన పొగలు రావడంతో స్థానికులు గమనించి తలుపు తెరిచారు. అప్పటికే ఇంటిలో సామగ్రి పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితురాలు వెంకటలక్ష్మికి ఆర్థిక సహాయం అందించారు. ప్రమాదాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

శిష్ట కరణాల ఆత్మీయ కలయిక



కరపత్రాలతో సంఘ సభ్యులు

మాధవధార, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి); గ్రేటర్ 51వ వార్డులోని మాధవధార ఆలయాల సమీపంలో ఆదివారం కార్తీక వన సమారాధన (పిక్నిక్) సందడి నెలకొంది. విశాఖ శిష్టకరణ సేవాసంఘం (కంచరపాలెం) ఆధ్వర్యంలో ఆత్మీయ కలయిక, వనభోజనాల కార్యక్రమం చేపట్టారు. అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు. ఉదయం కార్తీక దామోదరుని పూజతో కార్యక్రమాన్ని ఆరంభించారు. విజయనగరం, పెందుర్తి తదితర ప్రాంతాల నుంచి కూడా కుటుంబాలతో కలిసి వచ్చి వనసమారాధనలో పాల్గొన్నారు. అనంతరం సంఘం అధ్యక్షుడు బి.హరిబాబు కార్యవర్గ పనితీరు, విభాగాల విశ్లేషణ సభ్యులకు వివరించారు. అనంతరం సామూహిక భోజనాలు, ఆటపాటలు, వివాహ పరిచయ వేదిక కార్యక్రమాలు నిర్వహించుకున్నారు.

టీడీపీ సభ్యత్వాల నమోదు

అక్కయ్యపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజారు ఎదుట టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వార్డు పార్టీ అధ్యక్షుడు భరణికాన రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు కార్యకర్తలకు, అభిమానులకు సభ్యత్వ కార్డులను అందజేశారు. మాజీ కార్పొరేటర్ పైలా ముత్యాల నాయుడు, పలిశెట్టి అప్పన్న, షేక్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు. 46వ వార్డు కైలాసపురం పరిధి శాంతినగర్‌లో టీడీపీ సీనియర్ నాయకురాలు గొర్లె పార్వతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నాయకులు లాలం అర్జున్, కిలపర్తి దేముడు, మైలపల్లి శ్రీను, నూకరాజు, కాశీ, ఆర్.చందు, వినయ్, తరుణ్ పాల్గొన్నారు.

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కొండవాలు గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదును చురుగ్గా నిర్వహించారు. సీనియర్ నాయకుడు గొర్లె అప్పారావు ఆధ్వర్యంలో ఇందిరానగర్-3 గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సభ్యత్వం ఇచ్చారు. గొర్లె అప్పారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన మేరకు తెలుగువారి ఆత్మ గౌరవం కోసం పార్టీ సభ్యత్వం తీసుకోవాలని సూచించారు.

ఎల్‌బీ పార్కులో మందుబాబుల హల్‌చల్

అక్కయ్యపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వారు చేసే వీరంగం అంతా ఇంతా కాదు. ఎప్పుడు ఎలా వ్యవహరిస్తారో, ఎవరిని దూషిస్తారో, ఎవరిమీద పడతారోనన్నది స్థానికులకు నిత్యం ఆందోళనే. గ్రేటర్ 26వ వార్డు శాంతిపురం పరిధిలో మందుబాబుల హల్‌చల్‌తో స్థానిక నివాసితులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలోని ఎల్‌బీ పార్కు మందుబాబులకు అడ్డాగా మారింది. చీకటి పడితే చాలు.. మందుబాబులు ఈ ప్రాంతంలో వాలిపోయి స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అర్ధరాత్రి వరకూ బాతాఖానీ కొడుతూ రాకపోకలు సాగిస్తున్న వారి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని పలువురు చెబుతున్నారు. వేరే ప్రాంతం నుంచి ఇక్కడకు వచ్చి మద్యం తాగి, ఆ మందు సీసాలను పార్కులోనే పడేస్తున్నారు. మరికొందరు రోడ్డుపైనే విసిరేస్తున్నారు. మరుసటి రోజున వాటిని స్థానికులు, పార్కుకు వచ్చిన సందర్శకులు వీటిని చూసి షాక్‌కు గురవుతున్నారు. పగిలిన సీసాలు ఎవరికి గుచ్చుకుంటాయో తెలియని పరిస్థితి. రాత్రి సమయంలో ఆ రోడ్డుపై మహిళలు, యువతులు నడవడానికి భయభ్రాంతులకు గురవుతున్నారు. సాయంత్రం కాగానే మహిళలు బయటకు రావడానికి జంకుతున్నారు. మందుబాబుల అరుపులు, కేకలు విని పిల్లలతో వెళ్లేవారు హడలిపోతున్నారు. గుంపుగా ఉండడంతో ఎదురు తిరిగితే ఏం చేస్తారో అన్న భయంతో మిన్నకుండిపోతున్నారు. రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, వాహనచోదకులను బెదిరిస్తూ వారి వద్ద వస్తువులు, డబ్బులు లాక్కుంటున్నారని, ఇదేమిటని ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారని వాపోతున్నారు. పోలీసులు స్పందించి ఈ ప్రాంతంలో రాత్రి పూట గస్తీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఎల్‌బీ పార్కులో మద్యం సీసాలు



పార్కు లోపలి భాగం



పార్కులో పిల్లల ఆట వస్తువులు

శివ పూజలకు సిద్ధం



విద్యుత్ కాంతులతో లక్ష్మీనారాయణపురంలోని ఉమా కాశీవిశ్వేశ్వరాలయం

అక్కయ్యపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓంకార నాదంతో శైవ క్షేత్రాలు మారుమోగనున్నాయి. కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా బోళాశంకరుడిని ఆరాధించేందుకు శివాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. తెల్లవారు జామున భక్తులు క్షీరాభిషేకాలు, విభూధి అభిషేకాలు నిర్వహించనున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున రద్దీకి తగ్గట్టుగా దేవాదాయ శాఖ ఆలయ అర్చకులు, పాలకమండలి సభ్యులకు తగు సూచనలు చేసింది. కైలాసపురంలోని శివాలయం, లక్ష్మీనారాయణపురంలోని ఉమా కాశీవిశ్వేశ్వర లక్ష్మీనారాయణ ఆలయం, జగ్గారావు బ్రిడ్జి వద్ద గౌరీ పరమేశ్వరాలయం, రైల్వే న్యూకాలనీలోని శివాలయం, రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయాల్లో భక్తుల దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్తీక మాసంలో శివపార్వతులు, శివకేశవులను భక్తిప్రపత్తులతో కొలుస్తారు. కార్తీక మాస విశిష్టత దృష్ట్యా బిల్వపత్రం, పూలు, ఇతర పూజా సామగ్రిని రైతుబజార్లలో ఆదివారం విక్రయించారు. కొన్ని ప్రాంతాల్లో కార్తీక వన సమారాధనలు కూడా ప్రారంభించడం విశేషం.

సమస్యలు పరిష్కరించడం నా బాధ్యత: వంశీకృష్ణ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

జ్ఞానాపురం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చవలసిన బాధ్యత తనదేనని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రజలకు హామీ ఇచ్చారు. ఆదివారం జీవీఎంసీ 34వ వార్డు పరిధిలోని నేతాజీనగర్, కొబ్బరితోట, భూపేష్‌నగర్, అచ్చియ్యమ్మపేట ప్రాంతాల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ జోన్-4 అధికారులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.వార్డులో అసంపూర్తిగా ఉన్న యూజీడీ పనులు, నిర్మాణంలో ఉన్న కల్యాణమండపం పరిశీలించారు. నేతాజినగర్‌లో గుడినిర్మాణం, కొబ్బరితోట, భూపేష్‌నగర్‌లో సామాజిక భవనాల అవసరాన్ని ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకువచ్చారు. అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. సకాలంలో రోడ్ల నిర్మాణం చేపట్టి, సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, వార్డు టీడీపీ అధ్యక్షుడు వాసుపల్లి రామ్‌కుమార్, జనసేన అధ్యక్షుడు వి.నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఆంధ్ర శాసనాలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

సీతంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్, విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీ సంయుక్త ఆధ్వర్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయ చరిత్ర, పురావస్తు శాస్త్ర విభాగ విశ్రాంత ఆచార్యులు ఆచార్య సి.సోమసుందరరావు రాసిన ఆంధ్రప్రదేశ్‌లో శాసనాలు (ఇన్‌స్క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) అనే పుస్తకాన్ని ఆచార్య ఎ.ప్రసన్నకుమార్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తుపూర్వం రెండో శతాబ్దం నుంచి తెలుగు రాష్ట్రాల్లో అనాటి పాలకులు, రాజులు ఇచ్చిన శాసనాలను ఈ పుస్తకంలో పొందుపరిచారన్నారు. ఇది కేవలం శాసనాలకు సంబంధించినదే కాకుండా లిపి పుట్టుపూర్వోత్తరాలు, లిపి పరిణామక్రమం వంటి విషయాలను వివరంగా ఈ పుస్తకంలో చర్చించారన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ చరిత్ర, పురావస్తు శాస్త్ర విశ్రాంత ఆచార్యులు ఆచార్య కొల్లూరు సూర్యనారాయణ ఈ పుస్తకం గురించి సభకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీ కార్యదర్శి డి.ఎస్. వర్మ, చరిత్రకారులు తిమ్మారెడ్డి, రాణిశర్మ, రచయితలు బేతవోలు రామబ్రహ్మం, ద్విభాష్యం రాజేశ్వరరావు, డి.వి.సూర్యారావు, గండికోట విశ్వనాథం, సి.సూర్యలక్ష్మి, మల్లంపల్లి సోమశేఖర్ శర్మ, చారిత్రక అధ్యయన సంస్థ కార్యదర్శి శంకర్ నీలు భాగవతుల పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



పోటీలో పాల్గొన్న విద్యార్థులతో నిర్వాహకులు

సీతంపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న బాలల దినోత్సవం సందర్భంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో స్థితప్రజ్ఞ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 30 పాఠశాలల నుంచి 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ వైవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నవంబరు 9న వంటలు, చదరంగం, పాటల పోటీలను వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద గల ఆర్యవైశ్య యువజన సంఘంలో నిర్వహిస్తామని, ఆసక్తి గల విద్యార్థులు 99859 28666 నెంబరుకు ఫోను చేసి రిజిస్టర్ చేసుకోవాలన్నారు. విజేతలకు ప్రోత్సాహకాలు ఇస్తామని తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫైనాన్స్ ఆఫీసర్ సూర్యారావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు వార్తాపత్రికలు చదివి ప్రపంచంలో జరుగుతున్న వర్తమాన పరిస్థితులను అధ్యయనం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ ప్రతినిధులు, సభ్యులు ముత్తా గోవిందరావు, కె.రామకృష్ణ, ఎన్.శివప్రసాద్, పీలా దుర్గాబాయి, సూర్యనారాయణ, హేమంత్, గణేష్, సాయి, నవీన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాల కోసమే పుస్తకం రాశా

స్వీయచరిత్ర ఆవిష్కరణ సభలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

డాబాగార్డెన్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాల కోసమే స్వీయచరిత్ర పుస్తకాన్ని రాసినట్లు మాజీ మంత్రి గల్లా అరుణకుమారి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రైటర్స్ అకాడమీ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో గల్లా అరుణకుమారి పుస్తకావిష్కరణ సభ జరిగింది. వీవీ రమణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులుగా ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్, డాక్టర్ రమాదేవి గౌరినేని, చావ సుధారాణిలు పాల్గొన్నారు. యదార్థ సంఘటనలే తప్ప ఎవరినీ కించపరుస్తూ పుస్తకం రాయలేదని గల్లా అరుణకుమారి అన్నారు. విశాఖతో తనకు మంచి అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. నాయకుడు పది మంది కన్నీళ్లు తుడిచి వారి బాగోగులు చూడాలని, కాని నేడు ఆ పదానికి అర్థం మారిపోయిందన్నారు. జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ఈ పుస్తకం ఓ మినీ మహాభారతం అన్నారు. ఆచార్య యార్లగడ్డ మాట్లాడుతూ యాంగ్రీ యంగ్ వుమెన్ అని కొనియాడారు. అరుణకుమారి తండ్రి రాజగోపాల్‌నాయుడు లేకపోతే చంద్రబాబు నాయుడుకు రాజకీయ జీవితం లేదని తెలిపారు. ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్, డాక్టర్ రమాదేవి, చావ సుధారాణి మాట్లాడారు. ముందుగా నవరస థియేటర్ గ్రూప్ చిన్నారులచే 'సంక్షిప్త భారతం' ఆద్యంతం అలరించింది.

ఆరోగ్యశాఖలో ఎఫ్ఆర్ఎస్

... 5వ పేజీ తరువాయి

వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో సుమారు 1,500 మంది పనిచేస్తున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ అండ్‌వెల్‌నెస్ సెంటర్లు, అర్బన్‌హెల్త్ సెంటర్స్‌లో ఉద్యోగులు తీరుబడిగా రావడం, మధ్యాహ్నం వేగంగా వెళ్లిపోవడంతో మెరుగైన వైద్యసేవలు అందడం లేదన్న ఫిర్యాదులున్నాయి. వీటిపై దృష్టిసారించిన ఉన్నతాధికారులు ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని పటిష్టంగా అమలు చేయడం ద్వారా మాత్రమే చెక్ చెప్పేందుకు అవకాశం ఉంటుందని భావించారు. ఇందుకోసం ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించారు.

కొత్త ఏడాదిలో మిగిలిన ఉద్యోగులకు..

ఆరోగ్యశాఖలోని మిగిలిన ఉద్యోగులకు దీనిని వచ్చే సంవత్సరం నుంచి వర్తింప జేయనున్నారు. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలందాయి. ఎఫ్ఆర్ఎస్ యాప్ డౌన్లోడ్ చేసుకుని పనిచేసే కేంద్రానికి వచ్చినప్పుడు లాగిన్ కావాలి. సాయంత్రం వెళ్లినప్పుడు ముఖ హాజరు ద్వారా లాగ్ అవుట్ చేయాలి.



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్

వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

సీతమ్మధార, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ఎదురుగా గల ఆక్సిజన్ టవర్స్‌లో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అంటేనే ముందుగా నరవ ప్రకాష రావు గుర్తొస్తారన్నారు. మరో అతిథి, నట శిక్షకుడు ఎల్.సత్యానంద్ మాట్లాడుతూ భావితరాలకు మన చరిత్ర విశిష్టతను చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మంచి సినిమాల గురించి ప్రజలకు తెలియాలన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అధ్యక్షులు ఎ.కాశీ విశ్వేశ్వరరావు, కార్యదర్శి నరవ ప్రకాష్ రావు, ఉపాధ్యక్షురాలు ఎ.ఉషారాణి, కార్యనిర్వాహక కార్యదర్శి బి.చిన్నారావు, కార్యవర్గ సభ్యులు ఆర్.శివకుమార్, బి.గణేశ్వర బాబ్జి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఊరట

... 5వ పేజీ తరువాయి

ఆయా కేంద్రంలో కార్యకర్తలు, చిన్నారులకు సమస్యలు తీరనున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా అనేక అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస అవసరాలైన మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం లేవు. దీనిని గుర్తించిన కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాల్సిన పనుల జాబితాలో వీటిని చేర్చింది. ఈ మేరకు నిధులను కేటాయించింది. ఇందులో భాగంగా జిల్లాకు సుమారు రూ.31 లక్షలు విడుదల చేసింది. జిల్లావ్యాప్తంగా 776 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, వాటిలో సొంత భవనాలుండిమరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం లేని కేంద్రాలకు నిధులు అందిస్తోంది.

వసతుల కల్పనే ధ్యేయం

జిల్లాలోని 52 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టేందుకు ఒక్కో కేంద్రానికి రూ.36 వేలు చొప్పున రూ.18,72,000 మంజూరుచేసింది. మరో 74 కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు వీలుగా రూ.12,58,000 మంజూరు చేసింది. ఈ పనులు చేపట్టే బాధ్యతను గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు, నగర పరిధిలో జీవీఎంసీ అధికారులకు అప్పగించింది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనులు ప్రారంభం కాగా, అన్ని కేంద్రాల్లో వచ్చే నెలాఖరుకు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. వైసీపీ హయాంలో నాడు-నేడు పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు భవన నిర్మాణ పనులను కాంట్రాక్టర్లకు అప్పటించారు. చాలాచోట్ల పనులు చేసినా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదు. ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు చుట్టూ తిరిగినా ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ముందుగానే నిధులు విడుదల చేస్తోంది. దీంతో కాంట్రాక్టర్లు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు.

ఎడాపెడా ట్రాఫిక్ చలానాలు

... 5వ పేజీ తరువాయి

నెలల్లోగా చెల్లించకుంటే హెచ్చరిక మెసేజ్‌లు పంపుతున్నారు. ఎందుకు జరిమానా వేశారో అందులో పేర్కొనడం లేదు. సీతమ్మధార రైతుబజారు రోడ్డు మొత్తం ఆక్రమణలే. పార్కింగ్‌లో దుకాణాలు ఏమిటని ఎవరూ ప్రశ్నించరు. ఆ ప్రాంతంలో పోలీసులే కనిపించరు. కానీ ఫొటోలు తీసి చలాన్లు పంపుతున్నారు.

మెసేజ్‌లలో డొల్లతనం: గతంలో ట్రాఫిక్ చలానా జారీచేస్తే ఏ నిబంధన ఉల్లంఘించారో ఆ ఫొటో పంపించేవారు. సిగ్నల్ జంపింగ్, నో పార్కింగ్, నో హెల్మెట్ ఇలా వివరాలుండేవి. తాజాగా పంపే చలానా మెసేజ్‌ల్లో ఏ వివరాలూ కనిపించడం లేదు. చలానా నంబరు తప్ప కారణం పేర్కొనడం లేదు. వారు పంపించే లింక్ సరిగ్గా ఓపెన్ కావడం లేదు. ఒకసారి తప్ప రెండోసారి ఓపెన్ కాదని చెబుతున్నారు. సరైన విధానం లేకుండా సిటీ పోలీసులు వ్యవహరిస్తున్న తీరు ఆక్షేపణీయంగా ఉందని, దానిని మార్చుకోవాలని కోరుతున్నారు. నగరంలో ముందుగా పార్కింగ్ స్థలాలను ఖాళీ చేయించి, అవసరమైన చోట సదుపాయం కల్పిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందంటున్నారు.

చోరీల నియంత్రణపై కనిపించని కార్యాచరణ?

... 5వ పేజీ తరువాయి

టవర్స్‌లోని ఒక ఫ్లాట్‌లో ఇంటి యజమాని అయిన వైద్యురాలి నల్లపూసల హారం చోరీకి గురైందని ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై దర్యాప్తు చేసిన పోలీసులు అనుమానితురాలిని విచక్షణ రహితంగా కొట్టడంతో ఆమె కాలు విరిగి వివాదానికి దారితీసింది. ఈ ఘటనలో బాధ్యుడైన ఎస్ఐ జగదీశ్‌ను సీపీ సస్పెండ్ చేశారు. ఇటీవల రాత్రిపూట చోరీలు జరుగుతుండడంతో నగరవాసులు ఆందోళనకు గురవుతున్నారు. దీనికి అడ్డుకట్టవేయడంపై సీపీ శంఖబ్రతబాగ్చి దృష్టిసారించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, లేదంటో చోరీలకు అడ్డుకట్ట పడదని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు.

నక్కపల్లికి మహర్దశ

... 5వ పేజీ తరువాయి

గంటల వ్యవధిలోనే ఆర్సెలర్ మిట్టల్, జపాన్‌కు చెందిన నిప్పన్ స్టీల్ కంపెనీ సానుకూలంగా స్పందించాయి. రూ.1.4 లక్షల కోట్ల వ్యయంతో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకుసంసిద్ధత వ్యక్తం చేశాయి. రూ.70 వేల కోట్లతో మొదటిదశ నిర్మాణం చేపడతారు. ఇందుకు 2,640 ఎకరాల భూములు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిసింది. నక్కపల్లి మండలంలో 'విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఇప్పటికే భూములు సేకరించినందున కొత్తగా భూ సేకరణ చేపట్టాల్సిన పనిలేదు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు మండలంలోని రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, ఎన్.నర్సాపురం, వేంపాడు, డీఎల్‌పురం రెవెన్యూ గ్రామాల్లోని వీసీఐసీ భూములు పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది. విద్యుత్, నీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలి. రోడ్డు, రైలు, సముద్ర మార్గాలు అందుబాటులో వున్నాయి. ముడి సరకు దిగుమతి, ఉక్కు ఉత్పత్తుల ఎగుమతుల కోసం నక్కపల్లి మండలం రాజయ్యపేట వద్ద శాటిలైట్ పోర్టు నిర్మాణం చేపట్టే అవకాశం వుంది. ఆర్సెలర్ మిట్టల్ ప్రపంచంలో ఉక్కు ఉత్పత్తి చేసే కంపెనీల్లో రెండో స్థానంలో వుంది.

మన దేశంలో నాణ్యమైన ఇనుప ఖనిజం అందుబాటులో వుండడంతో తమ దేశ అవసరాలకు ఉత్తమశ్రేణి ఉక్కు ఉత్పత్తి కోసం నక్కపల్లి ప్రాంతం లో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు జపాన్‌కు చెందిన నిప్పన్ కంపెనీ ఆసక్తిగా వున్నట్టు సమాచారం. ఉక్కు ఉత్పత్తికి అవసరమైన ముడి ఖనిజం, ఇతర సరకులను ఎన్ఎండీసీ సరఫరా చేసే అవకాశం ఉంది. స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే ప్రత్యక్షంగా 20 వేల మందికి ఉద్యోగాలు, పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా వేస్తున్నారు. ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో మొదటిదశ నిర్మాణ పనులను 2029నాటికి పూర్తి చేస్తామని మిట్టల్ సంస్థ పేర్కొంది. ఆ తరువాత రెండో దశ పనులకు 3,800 ఎకరాల భూములు కావాల్సి వుంటుందనిప్రభుత్వాన్ని కోరింది. ప్రైవేటు సంస్థ కావడం, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు, సదుపాయాలు శరవేగంగా సమకూర్చే అవకాశాలుండడంతో ఐదేళ్లలో స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభం అవుతుందని అధికారవర్గాలు భావిస్తున్నాయి.

దుకాణం.. వివాదం!

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటుచేశారు. అక్కడకు 95 మీటర్ల దూరంలో నర్సింగ్ కాలేజీ ఉంది. దీంతో అక్కడ దుకాణం పెట్టడానికి వీల్లేదని ఎక్సైజ్ శాఖలోని కీలక అధికారి ద్వారా సమీపంలోని బార్ యజమాని అడ్డుపడ్డారు. అయితే గతంలో అదే భవనంలో ప్రభుత్వ మద్యం దుకాణం నడిచేది. ఏడాదికి సుమారు రూ.22 కోట్లు విక్రయాలు జరిగేవి. ఇప్పుడు అదే భవనంలో ఏర్పాటుకు అధికారులు అభ్యంతరం చెప్పడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గుడికి వంద మీటర్లు దూరంలో మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వకూడదు. కానీ నగరంలోని ఓ ప్రముఖ మద్యం వ్యాపారి సీతమ్మధార షిర్డీసాయిబాబా ఆలయానికి 20 మీటర్లు దూరంలోనే దుకాణం ఏర్పాటుచేసినా అధికారులు అడ్డుచెప్పలేదు. అలాగే సీతమ్మధారలోనే ఏఎంజీ ఆస్పత్రికి 85 మీటర్లు దూరంలో దుకాణం ఏర్పాటుచేశారు. ఇది ఒక ప్రజా ప్రతినిధి అనుచరుడిది కావడంతో చర్యలు లేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కెప్టెన్ రామారావు జంక్షన్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డులో ఒకేచోట రెండు మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఒక దుకాణం యజమాని ఎక్సైజ్ శాఖలోని కీలక అధికారిని ప్రసన్నం చేసుకుని పక్కనే ఉన్న దుకాణాన్ని మార్పించాలని కోరారు. దీంతో ఆ అధికారి సిబ్బందిని పంపి ఒకేచోట రెండుంటే గొడవలు జరుగుతాయని, మరోచోటుకు మార్చుకోవాలని చెప్పించారు. కాదంటే కక్ష కట్టి కేసులు రాసి, లైసెన్స్ రద్దుచేసి వేధిస్తారనే భయంతో ఆ యజమాని వేరొకచోట షాపును వెతుక్కునే పనిలో పడ్డారు. దీనిపై టీడీపీకి చెందిన నాయకుడికి బాధిత వ్యాపారులు మొరపెట్టుకోగా ఎక్సైజ్ శాఖలోని కీలక అధికారికి ఫోన్ చేస్తే..కొంతమంది ప్రజా ప్రతినిధుల సూచన మేరకే అలా చేయాల్సి వచ్చిందని చెప్పినట్టు సమాచారం. భూపేష్‌నగర్, వడ్లపూడిలో మద్యం దుకాణాల ఏర్పాటుకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనల వెనుక కొంతమంది బార్ నిర్వాహకుల ప్రమేయం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సంక్షిప్తంగా..

8 నుంచి గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు

వెంకోజీపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పాత వెంకోజీపాలెంలోని శ్రీనీలాదామ సేనా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీగౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు ఈ నెల 8 నుంచి జరుగనున్నట్టు సంఘం అధ్యక్షుడు ఆదారి వరదేశినాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది కూడా తొలి రోజు గౌరీ పరమేశ్వరీ విగ్రహాన్ని కొత్త వెంకోజీపాలెం బాలోళ మాత ఆలయం వద్ద పూజలు నిర్వహించి, అనంతరం ఊరేగింపుగా గ్రామంలోని రామాలయం వద్ద ఉంచనున్నట్టు చెప్పారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా మహిళలతో దీపాల పూజ, కుంకుమ పూజ, సామూహిక (గ్రామ ప్రజలందరూ తమ వంతుగా అమ్మవారికి కిలో పావు చొప్పున మిఠాయిలు సారెగా తీసుకుని వచ్చి అమ్మవారికి సమర్పించడం), మహా అన్నదానం ఉంటాయన్నారు. వీటితో పాటు ప్రతి రోజు రాత్రి 8 గంటల నుంచి పలు వినోద కార్యక్రమాలు ఉంటాయని వరదేశినాయుడు పేర్కొన్నారు. గ్రామస్తులంతా ఈ ఉత్సవాల్లో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

కిటకిటలాడిన జూపార్కు

ఆరిలోవ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జూపార్కు ఆదివారం సందర్శకులతో కిటలాడింది. 3988 మంది సందర్శకులు సందర్శించగా వారి నుంచి రూ.3,46,844 ఆదాయం సమకూరింది. జూలో జంతువులను వీక్షిస్తూ సందర్శకులు సరదాగా గడిపారు.

10 నెలలుగా ఇక్కడే..

» పనులు పూర్తయినా ఎక్స్‌కవేటర్‌ను తొలగించని అధికారులు



సర్వీసు రోడ్డులో నిలిపివేసిన ఎక్స్‌కవేటర్

ఆరిలోవ, నవంబరు 3 : (ఆంధ్రజ్యోతి) : యూజీడీ పనుల నిమిత్తం గత సంవత్సరం జీవీఎంసీ అధికారులు ఎక్స్‌కవేటర్‌ను తీసుకొచ్చి రోడ్డ తవ్వకాలు చేపట్టారు. ఆ పనులు పూర్తయి దాదాపు పది నెలలు కావస్తోంది. కానీ ఎక్స్‌కవేటర్‌ను మాత్రం ఇక్కడ నుంచి తీసుకుని వెళ్లలేదు. సర్వీసు రోడ్డులో ఓ పక్కన ఈ ఎక్స్‌కవేటర్ నిలిపి ఉంచారు. ఈ భారీ వాహనం రోడ్డు పక్కనే పార్కింగ్ చేయడంతో బీజీ సమయాల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనివల్ల తరచూ ట్రాఫిక్ జాం అవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ నుంచి ఎక్స్‌కవేటర్‌ను తొలగించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

సినిమా గైడ్

● **క** : జగదాంబ, శ్రీరామ, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
● **లక్కీ భాస్కర్** : మెలోడీ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహా-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కుర్మన్నపాలెం), శ్రీరామలక్ష్మి (తగరపువలస)
● **అమరన్** : శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహా-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
● **బఘీర** : వెంకటేశ్వర, సంగం, కిన్నెర, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), లలిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ)
● **దేవర** : రమాదేవి, శ్రీకన్య (గాజువాక), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 44, టమాటా 36, వంకాయలు (తెలుపు)34, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 28, పచ్చిమిర్చి 48 కాకరకాయలు 42, బీరకాయలు 38, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 44 దొండకాయలు 32, బంగాళ దుంపలు 32, ఆరటికాయ (పె)7, మునక్కాయలు (కిలో) 50, అల్లం (పాతది) 60, బరబటి 40, ములగి 20, గిన్నెకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 46, బీన్స కాయలు 38, వెల్లుల్లి (పెద్ది)290, క్యాబ్సికం (పెద్ది) 25, బీన్స్ (సెన్సిల్) 120, పొటల్స్ 42, కీరదోస 28, క్యాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, బెండల దుంపలు 30, కంద 72, దేముడు చిక్కుడు 72, కొండపనస 70, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్డు (నెక్)	
(డజను - రూ.లలో)	
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు	
బ్రాయిలర్	
రైతు ధర	110
హోల్‌సేల్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

ప్రయోజనం లేని రాయితీ

» రైతుబజార్ సబ్సిడీ ధరలపై ప్రజల పెదవి విరుపు
» నెలకు ఒకటే నూనె ప్యాకెట్
» మార్కెట్‌లోనూ ఇంచుమించు అదే ధర
» కందిపప్పు ధరలోనూ కానరాని వ్యత్యాసం
» బియ్యం కార్డు ఉండాలన్న నిబంధనతో ఇబ్బంది
» నెలకు 3 ఆయిల్ ప్యాకెట్లు కావాలంటున్న వినియోగదారులు



రైతు బజార్ వద్ద తక్కువ సంఖ్యలో ఉన్న కొనుగోలుదారులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ మార్కెట్లో నూనెలు, పప్పుల ధరలు నింగినంటుతుండడంతో కొంత ధర తగ్గించి విక్రయాలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోంది. ఈ క్రమంలో రైతు బజార్ల ఆవరణలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసింది. అయితే ఆశించిన స్థాయిలో ఇక్కడ విక్రయాలు జరగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నూనెలు కొనాలంటే కచ్చితంగా బియ్యం కార్డు ఉండాలన్న నిబంధన ఉంది. అంతేకాకుండా కేవలం సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ నెలకు ఒకటే ఇస్తున్నారు. దీంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బియ్యం కార్డు ఉన్న వారికి రూ.124లకు సన్ ఫ్లవర్ నూనె ప్యాకెట్, రూ.110లకు పామాయిల్ మూడు ప్యాకెట్లు ఇస్తున్నారు. క్యూఆర్ కోడ్‌ను వినియోగించి, సెల్‌ఫోన్‌లో రేషన్ కార్డు నెంబరును ఎంటర్ చేయాలి. ఒకసారి చేస్తే ఒక సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్టు, రెండోసారి పామాయిల్ మూడు ప్యాకెట్లు తీసుకోవచ్చు. ఇలా నెలలో ఒకసారి మాత్రమే తీసుకోవడానికి సాధ్యమవుతుంది. నెలకు ఒక్క ప్యాకెట్ మాత్రమే ఇస్తుండడంతో అంతగా ప్రయోజనం ఉండడం లేదని రేషన్ కార్డుదారులు అంటున్నారు. కనీసం మూడు ప్యాకెట్లు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రస్తుత పద్ధతి వల్ల రోజుకు పది నుంచి పదిహేను మందికి మాత్రమే ఆయిల్ ప్యాకెట్లు అందుతున్నాయి. అంతేకాకుండా సన్‌ఫ్లవర్ ఆయిల్ ధరపై మరీ అంత తగ్గింపు ఏమీ లేదు. పెద్ద మాల్స్‌లో ఇంచుమించు అదే ధరకు విక్రయిస్తుండడం, అదీ కేవలం ఒక్క ప్యాకెట్ మాత్రమే ఇస్తుండడంతో నూనె కొనేందుకు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

కేవలం ఆధార్ నెంబరు ద్వారా కిలో కందిపప్పు విక్రయిస్తున్నారు. కిలో రూ.150 లు కాగా, బియ్యం కిలో రూ.48లు వంతున 26 కిలోల బియ్యం బస్తా అందిస్తున్నారు. దీనిపై నిబంధనలు లేవు. రోజూ 60 నుంచి 80 కిలోల వరకూ కందిపప్పు, 500 నుంచి 600 కిలోల బియ్యం విక్రయాలు సాగుతున్నాయి. వినియోగదారులు రోజూ వచ్చి కూడా కొనుక్కోవచ్చు.

సన్ ఫ్లవర్ నూనె ప్యాకెట్లు ఎక్కువ ఇవ్వాలి



కొన్ని మార్ట్‌లలో రూ.125లకే సన్ ఫ్లవర్ ఆయిల్ విక్రయిస్తున్నారు. అక్కడ ఎలాంటి నిబంధనలు లేవు. ఇక్కడ మాత్రం బియ్యం కార్డు కచ్చితంగా ఉండాలని, అది కూడా నెలకు ఒక్క ప్యాకెట్ మాత్రమే అంటున్నారు. ఈ నిబంధన మార్చాలి. కనీసం నెలకు నాలుగు ప్యాకెట్లు ఇవ్వాలి. కందిపప్పు, బియ్యం వరకూ ధరలు బాగున్నాయి. నూనెల విషయంలో ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాల్సి ఉంది. బహిరంగ మార్కెట్లో కూడా ధరలు తగ్గేలా చూడాలి.

- వీరబాబు, ఆరిలోవ

మస్తరులో మస్కా



చెత్తను తరలిస్తున్న ఓ కార్మికురాలు

» 22వ వార్డులో పారిశుధ్య సిబ్బంది చేతివాటం
» కార్మికుల విధులకు రాకున్నా హాజరు

మద్దిలపాలెం, నవంబరు 3 : (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులో పారిశుధ్య సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. విధులకు హాజరు కాని మస్తర్లకు హాజరు వేసి వారి వేతనాలను జేబుల్లో వేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అందుకే వార్డులో పరిశుభ్రత పడకేసిందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ వార్డులో 61 మంది పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులు. మిగతా వారంతా కాంట్రాక్ట్ కార్మికులే. వీరంతా ప్రతి రోజూ ఉదయం వార్డులో పారిశుధ్య విధులకు హాజరవ్వాలి. రోజువారి విధులకు వచ్చే వారికి మస్తర్లు (హాజరు) వేసేటి హాజరు నమోదు చేస్తారు. కానీ రోజు సగం మంది విధులకు హాజరవ్వడం వల్ల వీధులన్నీ అధ్వానంగా తయారయ్యాయన్న విమర్శలు ఉన్నాయి.

విధులకు వచ్చే పారిశుధ్య కార్మికులకు కణజారతి వెనుక పార్కులో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మస్తర్లు వేస్తారు. అయితే 61 మంది ఉన్న కార్మికుల్లో రోజూ విధులకు వచ్చేది మాత్రం 25 నుంచి 30 మందేనని పలువురు అంటున్నారు. ఆ వచ్చిన వారికి హాజరు తీసుకుని పనులకు వెళ్లిపోతారు. అయితే హాజరు నమోదుకు రెండు రిజిస్టర్ బుక్‌లు వినియోగిస్తున్నారని తెలిసింది. కార్మికుల హాజరు తీసుకోవడానికి ఒక రిజిస్టర్, జీతాలు విత్ డ్రా చేయడానికి మరో రిజిస్టర్‌ను ఉపయోగిస్తున్నారని కార్మికులే ఆరోపిస్తున్నారు. రోజూ దాదాపు ఇరవై, ముప్పై మంది విధులకు హాజరవ్వకపోయినా ఇద్దరు, ముగ్గుర్ని మాత్రమే గైర్హాజరు వేసి వారి వేతనాలు స్వాహా చేస్తున్నారు. విధులకు పూర్తిగా రాని కార్మికులు కూడా ఈ వార్డులో ఉన్నారు. వారికి హాజరు వేసి కార్మికులు, సిబ్బంది వేతనాలు చెరిసగం పంచుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా శానిటరీ కార్యదర్శి భార్య, బంధువును కాంట్రాక్ట్ కార్మికులుగా నియమించుకుని పనులకు రాకపోయినా జీతాలు తీసుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది. దసరా పండుగకు కూడా వార్డులో శానిటరీ విభాగం నుంచి రూ.3 లక్షల వరకు మామూళ్ల వసూలు చేశారని తెలుస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి పెడితే నెల నెలా రూ. లక్షల్లో చేతివాటం ప్రదర్శిస్తున్న సిబ్బంది వ్యవహారాలు వెలుగు చూస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.


అక్రమాలకు పాల్పడితే చర్యలు

జీవీఎంసీ 22వ వార్డులో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంటుందనే ఫిర్యాదులు వస్తున్నాయి. శానిటరీ వర్కర్ల హాజరు నమోదు, వేతనాల చెల్లింపులు పరిశీలిస్తాం. ఎలాంటి అవకతవకలు ఉన్నా కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ ప్రసాద్, జోన్-3 వైద్యాధికారి

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

» నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

మద్దిలపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చెప్పారు. పీఠాపురం కాలనీలోని బీజేపీ భవనంలో ఆదివారం నిర్వహించిన బ్రాంచ్ లెవెల్ సీఏ విద్యార్థుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న టెక్నాలజీ ఉపయోగించుకుని నిందితులు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఆన్‌లైన్ మోసం, బ్యాంక్ ఖాతాలో నగదు తస్కరించడంలో కొత్త కొత్త పద్ధతులు అవలంబిస్తున్నారన్నారు. ప్రజలు కచ్చితంగా ఇటువంటి నేరాలపై అవగాహన కలిగి ఉంటే మోసపోయే అవకాశం ఉండదన్నారు. ఫోన్‌కు వచ్చే లింకులు ఓపెన్ చేయడం, ఆన్‌లైన్ గేమ్‌లు ఆడడం వంటివి చేయకూడదన్నారు. అనంతరం ఆన్‌లైన్ మోసాలు ఏ విధంగా జరుగుతున్నాయో ఎల్‌ఈడీ స్క్రీన్‌పై వివరించారు. కార్యక్రమంలో బీసీఏఐ నిర్వాహకులు అనిర్బన్ పాల్, లోకేష్ విద్యార్థి, ఉజ్వల, కె.లావణ్య, కె.సృష్టిక, కె.సంపత్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీగా కృష్ణకుమార్



విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన 172వ ట్రస్ట్ బోర్డు సమావేశంలో నాయుడు తోట శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీగా ఆస్పత్రి వ్యవస్థాపకుడు ఆత్మకూరి శంకర్రావు పెద్ద కుమారుడు కృష్ణకుమార్‌ను నియమించినట్టు శంకర్ ఫౌండేషన్ డీజీఎం కె.బంగార్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ట్రస్ట్‌బోర్డు సమావేశం బోర్డు చైర్మన్ ఎం.ఆనంద్ అధ్యక్షతన నర్సుల ఎ.విజయ్‌కుమార్, ఎ.కృష్ణకుమార్, ఎ.ప్రసన్న కుమార్ పాల్గొని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నట్టు తెలియజేశారు. ట్రస్టీగా ఎంపికైన కృష్ణకుమార్ ఆంధ్ర యూనివర్సిటీ నుంచి ఆప్టిక్ ఎకనామిక్స్‌లో మాస్టర్ డిగ్రీ, శంకర్ ఫౌండేషన్ బోర్డులో గత 13 సంవత్సరాలుగా పనిచేసిన అనుభవం ఉంది. కృష్ణకుమార్ నియామకం పట్ల సంస్థలో డాక్టర్లు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

కాలువలపై నిర్మాణాలతో రోడ్డు పైకి మురుగు

వెంకోజీపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కాలువలు మూసేసి నిర్మాణాలు.. కాలువలపైనే నిర్మాణ సామగ్రి ఉంచడం.. వెరసి కాలువలలో ప్రవహించాల్సిన మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుంది. జీవీ 15వ వార్డులోని శివాజీనగర్ కృష్ణమందిరం వద్ద కాలువల దుస్థితి. వర్షం వచ్చినా చాలు ఇక్కడి కృష్ణమందిరం పక్క నుంచి గెడ్డలో కలవాల్సిన మురుగు నీరు కాలువలపై చెత్తలు అడ్డం రావడం, మరో పక్క ముంతాజ్ హోటల్ వైపు కాలువలు పూర్తిగా మూసుకుపోవడంతో రోడ్లపై ప్రవహిస్తున్నాయి. దీంతో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇదే మార్గం నుంచి ప్రతి రోజూ అనేక మంది చిన్నారులు, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళుతుంటారు. వీరంతా మురుగు కారణంగా ఆ మార్గంలో వెళ్లలేక చుట్టూ తిరిగి గమ్యానికి చేరుకోవాల్సి వస్తుంది. అంతేకాకుండా ముంతాజ్ హోటల్‌కు ఆనుకుని ఉన్న ఇంటిలోకి మురుగు అంతా చేరుతుంది. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు కాలువలు మూసేసి మరీ నిర్మాణాలు చేపట్టిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని పాదచారులు, వాహనచోదకులు కోరుతున్నారు.



కాలువలు మూసేయడంతో రోడ్డుపై ప్రవహించే మార్గం లేక రోడ్డుపై పారుతున్న మురుగు

ఏయూ మైదానం.. చెత్తాచెదారం

» దీపావళి నేపథ్యంలో బాణసంచా స్టాళ్ల ఏర్పాటు
» అమ్మకాల అనంతరం ఎవరి దారిన వారే..
» పట్టించుకునే వారే లేరే..!




బాణసంచా స్టాళ్ల ఏర్పాటు చేసిన ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో పేరుకుపోయిన చెత్త

మద్దిలపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఇంజనీరింగ్ కళాశాల రోడ్డులోని మైదానాలు ప్లాస్టిక్ వ్యర్థాలు నిండిపోయాయి. వందల కిలోల ప్లాస్టిక్ కవర్లు మైదానాల్లో కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల నుంచి వచ్చిన చెత్తే ఇదంతా. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల రోడ్డులోని రెండు మైదానాల్లో 150 బాణసంచా స్టాళ్లు ఏర్పాటు చేశారు. దీపావళి వరకు మూడు రోజులు ఆయా స్టాళ్లలో బాణసంచా విక్రయించారు. అయితే ప్లాస్టిక్ కవర్లతో ప్యాకింగ్ చేసిన మందుగుండు సామాగ్రిను విక్రయాలకు పెట్టారు. వినియోగదారులు బాణసంచా కొనుగోలు చేసిన తర్వాత ప్యాకింగ్ చేసిన ప్లాస్టిక్ కవర్లు అక్కడే చించి పారేశారు. భారీగా విక్రయాలు జరగడంతో ప్లాస్టిక్ కవర్లు కూడా భారీగా పేరుకుపోయాయి. వందల కిలోల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు ఆయా మైదానాల్లో గుట్టలుగా పడివున్నాయి. పూర్తిగా ప్లాస్టిక్ మైదానంగా మారిపోయాయి. ఇంత పెద్ద స్థాయిలో ఇక్కడ ప్లాస్టిక్ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఫలితంగా మైదానాలు అధ్వానంగా తయారైంది. బాణసంచా దుకాణదారులు దీపావళితో బాధ్యత తీరినట్టు వెళ్లారు వదిలి స్థలాన్ని తొలగించి చేతులు దులుపుకున్నారు. ఇప్పుడు ఈ చెత్తతో కళాశాలలకు వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రౌండ్‌లో వాకింగ్ చేసే పాదచారులు చెత్త కుప్పల్తో నడవలేక అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలిస్తే పర్యావరణం మరింత దెబ్బతినే ప్రమాదముంది. ఇప్పటికైనా పారిశుధ్య సిబ్బంది ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.



మైదానం నిండా చెల్లాచెదురుగా పడి ఉన్న పాలిథిన్ కవర్లు

ఆంధ్రశాసనాలు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్, విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీ సంయుక్త ఆధ్వర్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయ చరిత్ర, పురావస్తు శాస్త్ర విభాగ విశ్రాంత ఆచార్యులు ఏసోమసుందరరావు రాసిన 'ఆంధ్రప్రదేశ్‌లో శాసనాలు' (ఇన్‌స్క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) పుస్తకాన్ని ఆచార్య ఎ.ప్రసన్నకుమార్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తుపూర్వం రెండో శతాబ్దం నుంచి తెలుగు రాష్ట్రాల్లో అనేక పాలకులు, రాజులు ఇచ్చిన శాసనాలను ఈ పుస్తకంలో పొందుపరిచారన్నారు. ఇది కేవలం శాసనాలకు సంబంధించిందే కాకుండా లిపి పుట్టుపూర్వోత్తరాలు, లిపి పరిణామక్రమం వంటి విషయాలను వివరంగా ఈ పుస్తకంలో చర్చించారన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ చరిత్ర, పురావస్తు శాస్త్ర విశ్రాంత ఆచార్యులు కొల్లూరు సూర్యనారాయణ ఈ పుస్తకం గురించి సమగ్ర పరిచయం చేశారు. కార్యక్రమంలో విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీ కార్యదర్శి డీవీ వర్మ, చరిత్రకారులు తిమ్మారెడ్డి, ఎం.రాజీవ్, రచయితలు బేతవోలు రామబ్రహ్మం, దుబ్బాపు రాజేశ్వరరావు, డీవీ సూర్యారావు, గండికోట విశ్వనాథం, సి.సూర్యలక్ష్మి, పుట్టా సోమశేఖర్ శర్మ, చారిత్రక అధ్యయన సంస్థ కార్యదర్శి శంకర్ నీలు బాగవతుల పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్వీ షరీఫ్



మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ఆయిదో సెక్టారు మసీదులో ఆదివారం గ్యార్వీ షరీఫ్ (మిలాద్)ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముంబై నుంచి వచ్చిన మత ప్రబోధకులు ప్రసంగించారు. సుమారు 650 మంది ముస్లింలు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రార్థనలు జరిపారు. నిర్వాహక కమిటీ అధ్యక్షుడు జాఫర్ అహ్మద్ రాహి, కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ జాఫర్, మౌలానా ముఫ్తీ ఖయ్యూమ్, మీర్ అబ్బాస్, హుస్సేన్, ఖాన్, మదీనా, పలు మసీదుల నుంచి ఇమామ్‌లు పాల్గొన్నారు.

యాదవ ప్రజా ప్రతినిధులను కలిసిన ఏవీఆర్



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసిన వెంకట్రావు

వెంకోజీపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన టీడీపీ తూర్పు నియోజకవర్గం నాయకుడు అక్కరమాని వెంకట్రావు ఆదివారం పలువురు యాదవ ప్రజా ప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలిశారు. నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, గాజువాక ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావులను కలిశారు. వీరంతా వెంకట్రావుకు అభినందనలు తెలిపారు.

రౌడీ షీటర్లు హద్దు మీరొద్దు

» ఈస్ట్ ఏసీపీ కె. లక్ష్మణమూర్తి



టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ లక్ష్మణమూర్తి

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్లు శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఈస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కె. లక్ష్మణమూర్తి హెచ్చరించారు. రౌడీషీటర్లకు కౌన్సెలింగ్‌లో భాగంగా ఆదివారం ఆయన టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లకు పలు సూచనలు, హెచ్చరికలు జారీచేశారు. రౌడీషీటర్ల కదలికలపై పోలీస్ శాఖ నుంచి పూర్తి నిఘా పెట్టామని, ఎవరైనా హద్దు మీరితే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామన్నారు. దాడులు, దొర్లన్నాలు, బెదిరింపులు, సెటిల్‌మెంట్‌లకు పాల్పడినట్టు సమాచారం అందితే జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వివాదాలకు దూరంగా ఉంటూ కుటుంబంతో సంతోషంగా గడిపేందుకు యత్నించాలని హితవుపలికారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ తిరుమలరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

సీతమ్మధార, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సీతమ్మధార ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ ఎదురుగా గల ఆక్సిజన్ టవర్‌లో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అంటేనే ముందుగా నరవ ప్రకాశ రావు గుర్తొస్తారన్నారు. మరో అతిథి, నట శిక్షకుడు ఎల్.సత్యానంద్ మాట్లాడుతూ బాలీవుడ్‌లకు మన చరిత్ర విశిష్టతను చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మంచి సినిమాల గురించి ప్రజలకు తెలియాలన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అధ్యక్షుడు ఎకె శివశేశ్వరరావు, కార్యదర్శి నరవ ప్రకాష్‌రావు, ఉపాధ్యక్షులు ఎ.ఉషారాణి, కార్యనిర్వాహక కార్యదర్శి బి.విజ్ఞారావు, కార్యవర్గ సభ్యులు ఆర్.శివకుమార్, బి.గణేష్‌రావు బాబ్జీ పాల్గొన్నారు.

వాటర్ ఫౌంటెన్‌ను పట్టించుకోరా..!

» 8 నెలల కిందట మరమ్మతులకు గురవడంతో అలంకార ప్రాయంగా మిగిలిన వైనం
» కళావిహీనంగా తయారైన పెదగదిలి జంక్షన్

ఆరిలోవ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ 12వ వార్డులో గల బీఆర్‌టీఎస్ రోడ్డులో పెదగదిలి వద్ద గల బావికి ఆనుకుని వాటర్ ఫౌంటెన్ అలంకారప్రాయంగా మిగిలింది. సుమారు 8 నెలల కిందట సుమారు పద్ద ఈ వాటర్ ఫౌంటెన్‌ను జీవీఎంసీ అధికారులు రూ.15 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేశారు. రంగురంగుల విద్యుద్దీపాలు అమర్చారు. దీంతో సాయంత్రమైతే ఈ వాటర్ ఫౌంటెన్ నుంచి గలగల పారే నీరు విద్యుద్దీపకాంతులతో ఎంతో ఆకర్షణీయంగా కనిపించేది. ఆ దృశ్యాన్ని చూసేందుకు ఈ మార్గంలో వెళ్లే వాహన చోదకులు కాసేపు తమ వాహనాలను నిలిపి ఆస్వాదించేవారు.

అయితే కొన్ని నెలలుగా ఈ వాటర్ ఫౌంటెన్ పని చేయడం లేదు. దీని నిర్వహణ కోసం వాడిన వస్తువులు నాసిరకంవి కావడమే ఇందుకు కారణమని స్థానికులు మండిపడుతున్నారు. సాయంత్రం కాగానే వాటర్ ఫౌంటెన్ కారణంగా ఎంతో సందడిగా, శోభాయమానంగా కనిపించిన ఈ ప్రాంతం ఇప్పుడు కళావిహీనంగా మారిందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నగరాభివృద్ధి తర్వాతే ఎంతగానో ఆకర్షణీయంగా ఉండే వాటర్ ఫౌంటెన్ నిర్వహణపై జీవీఎంసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. పెదగదిలి వద్ద మరమ్మతులకు గురైన వాటర్ ఫౌంటెన్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

శిల్పకళలో దిట్ట పరమేశ్వరరావు



అయ్యప్పస్వామి ఆలయం గోడపై పరమేశ్వరరావు రూపొందించిన పలు దేవుళ్ల విగ్రహాలు

(అనకాపల్లి టౌన్-ఆంధ్రజ్యోతి)

మనసులో మెదిలే దేవతామూర్తుల రూపాలను కళ్ల ఎదుట ఆవిష్కరింపజేయడం ఆయనకు ఉలితో పెట్టిన విద్య. ఆయన రూపొందించిన విగ్రహాల్లో జీవకళ ఉట్టి పడుతుంది. అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం దిబ్బవీధికి చెందిన విల్లూరి వెంకట పరమేశ్వరరావు శిల్పాల తయారీలో ఉమ్మడి విశాఖ జిల్లాలోనే కాకుండా ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాల్లో కూడా గుర్తింపుపొందారు. సుమారు నాలుగు దశాబ్దాల నుంచి వేలాది విగ్రహాలను ఆయన రూపొందించారు. ఎంతోమంది ప్రముఖుల చేతుల మీదుగా సన్మానాలు, సత్కారాలు పొందారు.


పశ్చిమబెంగాల్‌లోని ఆద్రాలో రెండు దశాబ్దాల క్రితం పరమేశ్వరరావు తయారు చేసిన 54 అడుగుల హనుమాన్ విగ్రహం

విల్లూరి వెంకట పరమేశ్వరరావు స్థానిక దాడి భోగలింగంనాయుడు ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నప్పుడే శిల్పాలు, విగ్రహాల తయారీపై ఆసక్తిని పెంచుకున్నారు. అప్పట్లో పరమేశ్వరావు ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లే మార్గంలో పండూరి సత్యనారాయణ అనే శిల్పి విగ్రహాలు తయారు చేస్తుండేవారు. రోజూ స్కూల్‌కు వెళ్లి వచ్చే సమయంలో ఆయన దృష్టంతా శిల్పాల తయారీపైనే ఉండేది.

దేవతామూర్తుల విగ్రహాల తయారీపై బాల్యంలోనే ఆసక్తి

- మనసులో మెదిలే రూపాలకు శిల్పావిష్కరణ
- పలువురు ప్రముఖుల చేతుల మీదుగా సత్కారాలు

విగ్రహాలు, శిల్పాలను తయారుచేయాలన్న మక్కువతో సత్యనారాయణ వద్ద శిష్యుడిగా చేరారు. శ్రద్ధతో సాధన చేసి, గురువు వద్ద ఎన్నో మెలకువలు తెలుసుకున్నారు. కొంతకాలం తరువాత తానే సొంతంగా మట్టి, సిమెంట్, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వంటి ముడి పదార్థాలను వినియోగించి దేవతలు, జాతీయ నేతలు, దివంగత రాజకీయ నాయకుల విగ్రహాలను తయారు చేయడం ప్రారంభించారు. ఎప్పటికప్పుడు నైపుణ్యాన్ని పెంచుకుంటూ జీవం ఉట్టిపడేలా విగ్రహాలు తయారు చేయడంలో పరమేశ్వరరావుది అందె వేసిన చెయ్యి. అనకాపల్లిలోని పలు ఆలయాల్లో ప్రస్తుతం ఉన్న దేవతామూర్తుల విగ్రహాలు ఆయన చేతితో రూపుదిద్దుకున్నవి కావడం విశేషం. శిల్పకళ మీద మక్కువతో ఒకపక్క విగ్రహాలు తయారుచేస్తూనే మరోవైపు 1984-85లో ఇంటర్మీడియట్ పూర్తిచేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాల తయారీపై పరమేశ్వరరావు దృష్టిసారించారు. ఆగస్టు 15వ తేదీ 2004లో లండన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఎం నాయుడు చేతుల మీదుగా శిల్పకళారత్న అవార్డును స్వీకరించారు. 2018లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు.


శ్రీకృష్ణుని విగ్రహానికి తుది రూపు ఇస్తున్న శిల్పి పరమేశ్వరరావు


పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా సత్కారం పొందుతున్న పరమేశ్వరరావు


రాజుపాలెం సూర్యనారాయణస్వామి ఆలయంలో పరమేశ్వరరావును సత్కరించి, జ్ఞాపికను అందజేస్తున్న చినజీయర్‌స్వామి

శిల్ప కళలో మైలురాళ్లు...

- అనకాపల్లి పట్టణంలోని పార్కు జంక్షన్ వద్ద గౌరీ పంచాయతన ఆలయం అయ్యప్పస్వామి ముఖద్వారాన్ని 2002లో పరమేశ్వరరావు తీర్చిదిద్దారు. దీంతో ఆలయ కమిటీ వారు స్వర్ణ కంకణంతో సత్కరించారు.
- బెంగాల్ రాష్ట్రంలోని ఆద్రా గ్రామంలో 2004వ సంవత్సరంలో 54 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని తయారు చేశారు. విష్ణు పంచాయతన ఆలయం నిర్మించి కమిటీ వారిచే స్వర్ణ కంకణంతో సత్కారం పొందారు.
- 2022లో దేమునిగుమ్మంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ కుడ్యాలపై శ్రీవారి చరిత్రను బొమ్మల రూపంలో తీర్చిదిద్దారు.
- 2023లో అనకాపల్లి మండలం రాజుపాలెం సూర్యనారాయణమూర్తి ఆలయంలో దశావతారాల్లో దేవుళ్ల విగ్రహాలు తయారుచేసి చినజీయర్‌స్వామిచే సత్కారం పొందారు.
- అనకాపల్లి పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం ఆవరణలో వున్న అయ్యప్పస్వామి దేవాలయంలో 2023లో స్వామివారి చరిత్రను బొమ్మల రూపంలో ఆవిష్కరించారు.
- దివంగత రాజ్యసభ సభ్యుడు వీవీ రమణ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా గత ఏడాది ఆయన (రమణ) విగ్రహాన్ని తయారుచేశారు. దీనిని పూర్వ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఆవిష్కరించి, పరమేశ్వరరావును సన్మానించారు.
- ఉమ్మడి కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌లో శ్రీకృష్ణుని విగ్రహాన్ని అందంగా తీర్చిదిద్దారు.

విదేశాల్లో విగ్రహాలు తయారు చేయాలన్నదే లక్ష్యం



విదేశాల్లో కూడా విగ్రహాలు తయారుచేసి మన్ననలు పొందాలన్నదే నా లక్ష్యం. స్థానిక ఎన్‌ఆర్‌ఐలు సహకరిస్తే అమెరికాతోపాటు మలేషియా, సింగపూర్, జపాన్ వంటి దేశాల్లో విగ్రహాలు తయారుచేస్తాను. తానా మహాసభల్లో పాల్గొనాలన్నది నా కోరిక. శిల్ప కళ ద్వారా పలువురికి ఉపాధి కల్పించి, శిల్పకళాకారులుగా తీర్చిదిద్దాలన్నదే ఆశయం. గతంలో నా వద్ద శిక్షణ పొందిన వారిలో కొంతమంది సొంతంగా విగ్రహాలు తయారుచేస్తుండడం ఆనందం కలిగిస్తున్నది.

- వి.వి.పరమేశ్వరరావు, శిల్పి

రుషికొండ లాంటి నిర్మాణాలు ఎక్కడా లేవు

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ టూరిజం ప్రాజెక్టు వంటి నిర్మాణాలు రాష్ట్రంలో ఎక్కడా లేవని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. లాసన్స్‌బే కాలనీలోని వైసీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రుషికొండపై అద్భుతమైన భవనాలు నిర్మించామని, సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా కితాబిచ్చారన్నారు. చంద్రబాబు విశాఖకు వస్తున్నారంటే స్టీల్‌ప్లాంట్‌పై ప్రకటన చేస్తారని ఉత్తరాంధ్ర ప్రజలు ఆశించారని, కానీ తన అసమర్థపాలన నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి రుషికొండ పేరుతో డైవర్షన్ పాలిటిక్స్ చేశారని ఆరోపించారు. స్టేట్ గెస్ట్ హౌస్ కట్టాలని తమ ప్రభుత్వం భావిస్తే కోర్టుకెళ్లి స్టే తెచ్చారని విమర్శించారు. రుషికొండ భవనాలను ప్రజలకు చూపిస్తామంటున్నారని, వాటితో పాటు తమ ప్రభుత్వ హయాంలో నిర్మించిన భవనాలన్నింటినీ కూడా ప్రజలకు చూపించాలని డిమాండ్ చేశారు. విజయనగరం జిల్లా గుర్లలో డయేరియా బాధితులను చంద్రబాబు ఎందుకు పరామర్శించ లేదని ప్రశ్నించారు. బాగున్న రోడ్లను తవ్వి పూడ్చడం కంటే ఉన్న గోతులను కప్పాలని సూచించారు. ఆయనతో పాటు వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవిరెడ్డి ఉన్నారు.

పంచారామ దర్శని బస్సులు ప్రారంభం


బస్సులను ప్రారంభిస్తున్న విశాఖపట్నం డిపో మేనేజర్ గంగాధర్

ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీమాసంలో వచ్చే సోమవారాల్లో పంచారామాలు దర్శించుకోవాలనుకునే భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీ ద్వారా అవకాశం కల్పించింది. ఇందుకు సంబంధించిన మూడు బస్సులు ద్వారకా బస్‌స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. విశాఖపట్నం డిపో మేనేజర్ గంగాధర్ వీటిని ప్రారంభించారు. సాయంత్రం 5 గంటలకు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బయల్దేరిన బస్సులు సోమవారం ఉదయానికి అమరావతి చేరుకుంటాయి. అక్కడ స్వామివారిని దర్శించుకుని, అనంతరం భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట ఆలయాలను సందర్శించి రాత్రికి ద్వారకాబస్‌స్టేషన్‌కు చేరుకుంటాయి. ప్రతి ఆదివారం సాయంత్రం ఈ బస్సులు బయల్దేరుతాయి.

అవినీతికి వ్యతిరేకంగా వాక్‌థాన్


వాక్‌థాన్‌లో పాల్గొన్న పంజాబ్ నేషనల్ బ్యాంకు అధికారులు, సిబ్బంది

మహారాణిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆదివారం బీచ్‌రోడ్డులో వాక్‌థాన్ నిర్వహించారు. ఉదయం పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆధ్వర్యంలో బిజినెస్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా ఆర్కే బీచ్‌లోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి వాక్‌థాన్ నిర్వహించారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విశాఖ సర్కిల్ హెడ్ వి.నీలిమా, రామ్ బ్రాంచి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల జోలికొస్తే ఊరుకోం

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు


ధర్నా శిబిరంలో పాల్గొన్న సీహెచ్ నరసింగరావు, తదితరులు

గాజువాక, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల ఉపాధి జోలికొస్తే సహించేది లేదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు హెచ్చరించారు. స్టీల్ ప్లాంటులో పనులు కోల్పోయిన కాంట్రాక్టు కార్మికులకు తక్షణమే ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పాత గాజువాకలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం దొడ్డిదారిన కాంట్రాక్టు కార్మికులను తొలగించేందుకు కుట్ర చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే టెండర్ల గడువు ముగిసినా పిలవడం లేదన్నారు. ఇటీవల సుమారు ఆరు వందల మంది కాంట్రాక్టు కార్మికులు పనులకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాంటులో పూర్తి స్థాయి ఉత్పత్తి తీస్తేనే సమస్య పరిష్కారమవుతుందని, కాంట్రాక్టు కార్మికులను తగ్గిస్తే కాదన్నారు. ఇంటక్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను తొలగించలేదని ఉక్కు యాజమాన్యం చెబుతున్నా, అందుకు భిన్నంగా పరిస్థితులు ఉన్నాయన్నారు. ఉక్కు యాజమాన్యం మాటలకు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీల మాటలకు పొంతన లేకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు జి.శ్రీనివాసరావు, నమ్మి రమణ, వంశీకృష్ణ, ఎస్.తాతారావు, యు.అప్పారావు, పిట్టా రెడ్డి, రామిరెడ్డి, గురునాథ్, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అసోసియేషన్ విశాఖపట్నం సిటీ, డివిజన్ కార్యవర్గాలకు ఆదివారం ఎన్నికలు జరిగాయి. సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిటీ అధ్యక్షుడిగా బీవీఎస్ నియోగి (యూఎల్‌సీ డీటీ), అసోసియేట్ అధ్యక్షుడిగా పీయూఎస్. మహేశ్వరరావు (సర్కిల్-3 చెకింగ్ ఇన్‌స్పెక్టర్), ఉపాధ్యక్షులుగా వీవీఎస్‌వీ వరుణ్ (ఎన్‌హెచ్-16 ఆర్ఐ), బి. సతీష్ (సర్కిల్ -3 చెకింగ్ ఇన్‌స్పెక్టరు), ఎం. భవాని (యూఎల్‌సీ సెక్షన్), కార్యదర్శిగా బి. రవిశంకర్ (పౌర సరఫరాల శాఖ డీటీ), సంయుక్త కార్యదర్శులుగా జెఎస్‌వీవీఎస్ మూర్తి (కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్), పీవీ. రవివర్మ (ఆర్డీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట), కె. లక్ష్మణరావు (కలెక్టరేట్), కార్యదర్శిగా వీఎస్‌ఆర్ కృష్ణ (కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్), కార్యవర్గ సభ్యులుగా డి. రామకృష్ణ, ఆర్. వరలక్ష్మి ఎన్నికయ్యారు. అలాగే డివిజన్ సంఘానికి అధ్యక్షుడిగా పి. నవీన్‌రాజు (ములగాడ తహసీల్దారు కార్యాలయం డీటీ), అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం. మహేశ్వరరావు(గాజువాక ఆర్ఐ), ఉపాధ్యక్షులుగా బి. మధుకుమార్ (ఆర్డీవో కార్యాలయం),వి. సురేష్‌యాదవ్ (ఆర్డీవో కార్యాలయం), జి.రాము (పెదగంట్యాడ ఆర్ఐ), కార్యదర్శిగా ఎస్‌వీకే. చైతన్య (మహారాణిపేట తహసీల్దారు కార్యాలయం డీటీ), సంయుక్త కార్యదర్శులగా ఎస్.మృదుల (మహారాణిపేట ఆర్ఐ), జెవీఎస్. చంద్రశేఖర్ (ఆర్డీవో కార్యాలయం), జె. శివశంకర్ (గాజువాక తహసీల్దారు కార్యాలయం). కోశాధికారిగా కె. నగేష్ (మహారాణిపేట ఆర్ఐ), కార్యవర్గ సభ్యులుగా హసీంబేగ్, కె. కోమలి ఎన్నికయ్యారు.

దుర్మార్గ ఆలోచనలతోనే జగన్ ఓటమి

» **శాప్ చైర్మన్ రవినాయుడు**


రవినాయుడు

సాగర్‌నగర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జగన్ దుర్మార్గపు ఆలోచనల వల్లే వైసీపీ ఓడిపోయిందని ఏపీ క్రీడా సాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. క్రీడాకారుల ఆట స్థలాలను ఆక్రమించుకున్న అక్రమార్కుడు అని దుయ్యబట్టారు. ఆదివారం ఆయన రుషికొండ బీచ్‌కు ఆనుకుని ఉన్న శాప్ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ 2002లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు వాటర్‌స్పోర్ట్స్ నిర్వహణకు ఎకరా భూమిని రుషికొండ బీచ్‌లో కేటాయించారన్నారు. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో శాప్‌తో పాటు వాటర్ స్పోర్ట్స్ అసోసియేషన్, ఫెడరేషన్లు అనేకపోటీలు నిర్వహించాయన్నారు. వైసీపీ ప్రభుత్వం క్రీడారంగాన్ని అణగదొక్కిందని, క్రీడాకారులను సైతం నాశనం చేసిందని మండిపడ్డారు. జగన్ తన హెలిప్యాడ్ కోసం శాప్ ఆధీనంలో ఉన్న వాటర్‌స్పోర్ట్స్ స్థలాన్ని లాక్కున్నారన్నారు.

ఆ భూమిని సీఎం చంద్రబాబునాయుడు దృష్టిలో పెట్టి శాప్ తిరిగి వెనక్కి తీసుకుంటుందన్నారు. అలాగే వాటర్ స్పోర్ట్స్‌కు మళ్లీ పూర్వ వైభవం తీసుకొస్తామని చెప్పారు. ఆడుదాం ఆంధ్రా పేరుతో పేద క్రీడాకారుల సొమ్ము కాజేసిన ఏ ఒక్కరినీ విడిచిపెట్టేది లేదని, దీనికి సంబంధించిన పూర్తి ఆధారాలను వెల్లడిస్తామని స్పష్టం చేశారు. ఆయనతో పాటు డీఎస్డీఓ జాన్ గేలియోట్, లివిన్ అడ్వెంచర్స్ స్టేట్ కయాకింగ్, కనోయింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలరామ్‌నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్‌గోపాల్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సతివాడ శంకరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కోలా రంజిత్, సురేంద్ర చౌదరి ఉన్నారు.

'మిషన్ లైఫ్'తో కలిసి సాగుతాం

ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ లైఫ్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని ఈపీడీసీఎల్ ఎండీ పృథ్వీతేజ్ వెల్లడించారు. బీఈఈ దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారు రూపొందించిన మిషన్ లైఫ్ పోస్టర్‌ను ఆదివారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం ఆశయాలకు అనుగుణంగా పనిచేసేందుకు ఈపీడీసీఎల్ పలు కార్యక్రమాలు చేపడుతోందని. పర్యావరణానికి మేలు చేయడంతో పాటు సుస్థిర అభివృద్ధికి తోడ్పడనున్నామని చెప్పారు. బీఈఈ, పీపీఎస్ఈసీఎంతో కలిసి సమగ్ర కమ్యూనికేషన్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని యోచిస్తుందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లోని వినియోగదారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విద్యుత్ సంస్థ సభ్యులు ప్రవీణ్ గుప్తా, బీఈఈ సెక్రటరీ మిలింద్ దేవరా, చంద్రం, భాస్కర్, కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వం కేటాయించిన భూముల్లోనే లేఅవుట్

» **భీమిలి కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ ప్రతినిధులు**


సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు హరిగోపాలరావు

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దాదాపు యాభై ఏళ్ల క్రితం ప్రభుత్వం కేటాయించిన భూముల్లోనే లేఅవుట్ వేస్తున్నామని, అవి కూడా మార్కెట్ ధర పెట్టి కొన్న భూములని భీమిలి మ్యూచవల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు హరి గోపాలరావు తెలిపారు. సిరిపురం జంక్షన్‌లోని హోటల్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యదర్శి సూరిబాబు, ఉపాధ్యక్షుడు నారాయణరావు, ఇతర సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. తాము పనులు చేపట్టిన ప్రాంతం ఎర్రమట్టి దిబ్బలతో కూడినది కావడంతో జియో హెరిటేజ్ స్థలం చదును చేస్తున్నామని సోషల్ మీడియాలో వైరల్ చేశారని, 22వ వార్డు కార్పొరేటర్ హైకోర్టులో పిల్ కూడా వేశారని ఆరోపించారు. సొసైటీకి ప్రభుత్వం సర్వే నంబరు 118లో 373.95 ఎకరాలు కేటాయించిందన్నారు. ఆ తరువాత కాలంలో కొంత స్థలం బీచ్ రహదారికి తీసుకున్నారని, 91.5 ఎకరాలు జియో హెరిటేజ్ స్థలంగా గుర్తించగా, మిగిలిన 242.47 ఎకరాల్లోనే లేఅవుట్‌కు జీవీఎంసీకి దరఖాస్తు చేశామన్నారు. వివిధ సంస్థల నుంచి ఎన్ఓసీకి దరఖాస్తు చేశామన్నారు. గతంలోనే వుడాకు భూ వినియోగ మార్పిడి ఫీజు కూడా కట్టామని చెప్పారు. ఈ భూమి కోసం సుప్రీం కోర్టుకు వెళ్లి ఆదేశాలు తెచ్చుకున్నామన్నారు. సొసైటీలో 2 వేల మంది వరకు సభ్యులు ఉన్నారని, వారంతా ఇప్పుడు 70 ఏళ్లు దాటిన వారేనని వివరించారు. విశాఖలో ఏయూ కూడా ఎర్రమట్టి దిబ్బలతో కూడినదేనని, బీచ్ రోడ్డు కూడా అంతేనని, రుషికొండలో యూనివర్సిటీ కూడా ఎర్ర మట్టితో కూడినదేనన్నారు. ఎ ర్రమట్టి ఉన్నదంతా జియో హెరిటేజ్ స్థలం కాదని తెలిపారు. సొసైటీ పనులపై తప్పుడు ప్రచారం చేయవద్దని కోరారు. ఎవరికీ వ్యక్తిగతంగా రూపాయి కూడా రాదని, అంతా సొసైటీ పేరుతోనే ఉంటుందన్నారు. పనులు ఆపించడం వల్ల లక్షలాది రూపాయల నష్టం వచ్చిందన్నారు.

క్రైం... crime news

పీఎంపాలెంలో వ్యాపారి ఆత్మహత్య


గణేశ్ (ఫైల్ ఫొటో)

ఎండాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పీఎంపాలెం క్రికెట్ స్టేడియం సమీపంలో ఉన్న ఓ హోటల్‌లో వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. కొవ్వూరు గణేశ్ (39) భార్య విజయకుమారి (32), కుమార్తెలు సరిత (17), కీర్తన (14)తో కలిసి లాసన్స్ బే కాలనీ లోకమ్ స్ట్రీట్‌లో ఉంటున్నాడు. ఈనెల 30న అతను పీఎంపాలెం క్రికెట్ స్టేడియం ప్రాంతంలోని ఓ హోటల్‌కు వెళ్లి రెండు రూమ్‌లు తీసుకుని, రూ.4 వేలు చెల్లించాడు. శనివారం ఉదయం 11 గంటలకు ఒక్కరే వచ్చాడు. మధ్యాహ్నం బయటకు వచ్చి మళ్లీ లోపలికి వెళ్లిపోయాడు. తరువాత రాలేదు. ఆదివారం ఉదయం 10 గంటలకు హోటల్ బాయ్ డోర్ కొట్టగా తీయలేదు. రాత్రి ఎక్కువ సేపు మేల్కొని ఉన్నారేమోనని రూమ్ క్లీనర్స్ కూడా వెనుతిరిగారు. మధ్యాహ్నం రెండు గంటలకు హోటల్ సిబ్బంది రూమ్‌లో ఉన్న ల్యాండ్ ఫోన్‌కి కాల్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో అనుమానం వచ్చి పీఎంపాలెం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి తలుపులు తీయగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. మృతుడికి ద్వారకా నగర్‌తో పాటు రాజమండ్రి వరకు ఏసీలు, ఫ్రిడ్జ్‌లు అమ్మే 14 షోరూమ్‌లు కూల్‌జోన్ పేరుతో ఉన్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. అతని స్వస్థలం శ్రీకాకుళం జిల్లా పాలకొండ అని చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కాగా గణేశ్ చనిపోవడానికి ముందు సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. కుటుంబ సభ్యులు క్షమించాలని, కుమార్తెలు ధైర్యంగా ఉండాలని కోరాడు. తన మృతికి కారణం వ్యాపారంలో పక్క షోరూమ్ నిర్వాహకులు తక్కువ ధరకు వస్తువులను విక్రయించడంతో పాటు తన షోరూమ్ నుంచి వచ్చేవారికి మరింత తక్కువ ధరలకు విక్రయిస్తున్నారని చెప్పారు. వ్యాపారం దెబ్బకొట్టడం వల్లే చనిపోతు న్నట్టు పేర్కొన్నారని సీఐ బాలకృష్ణ తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- సముద్రంలో మునిగి యువకుడి మృతి
- అచ్యుతాపురం మండలం సీతపాలెం వద్ద ఘటన
- మృతుడి స్వస్థలం విశాఖలోని నాయుడుపేట ప్రాంతం


మృతుడు అభిరామ్

అచ్యుతాపురం/ రాంబిల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం- రాంబిల్లి మండల సరిహద్దులోని సీతపాలెం కొండవద్ద సముద్రంలో మునిగి ఒక యువకుడు మృతిచెందాడు. రాంబిల్లి సీఐ నరసింగరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. నగరంలోని వేపగుంట నాయుడుతోటకు చెందిన సిరిగుడి అభిరామ్ (21), మరో ముగ్గురు యువకులు రెండు బైక్‌లపై ఆదివారం ఉదయం 6.30 గంటలకు సీతపాలెం సమీపంలో సముద్ర తీరం వద్దకు వచ్చారు. ఇక్కడ నీటిలో దిగి సరదాగా ఈత కొడుతున్నారు. ఈ క్రమంలో అభిరామ్ ఒక రాయిపై నిలబడి వుండగా బలమైన కెరటం తాకింది. నీటిలో మునిగిపోతుండడంతో మిగిలిన యువకులు కేకలు వేశారు. సమీపంలో వున్న కొండపాలేనికి చెందిన మత్స్యకారుడు వాసుపల్లి నూకరాజు, పూడిమడక శివారు కడపాలేనికి చెందిన ఎరిపిల్లి కాసులు అలియాస్ కిరణ్, మరో యువకుడు పడవపై ఉప్పుటేరులో నుంచి సముద్రంలోకి వెళ్లి యువకుడిని పట్టుకుని పడవలోకి చేర్చారు. తాగిన నీటిని బయటకు కక్కించడానికి యత్నించారు. అనంతరం తీరానికి చేర్చి స్నేహితులకు అప్పగించారు. అప్పటికే అపస్మారకస్థితికి చేరిన అభిరామ్‌ను అచ్యుతాపురంలో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. అభిరామ్ తండ్రి జగన్నాథరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ అధికారిపై కేసు నమోదు

పెదగంట్యాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ అధికారి పరదేశినాయుడుపై న్యూపోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు. నెల్లిముక్కు కాలనీకి చెందిన యెల్లేటి పెంటమ్మకు చెందిన ఆర్-కార్డును పరదేశినాయుడు తన పేరిట మార్చుకుని ఉక్కు కర్మాగారంలో డిప్యూటీ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్నట్టు పెంటమ్మ కుటుంబ సభ్యులు యెల్లేటి సీత, నరసయ్యమ్మ, దేముళ్లు న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి సీఐ జి.దాలిబాబు దర్యాప్తు చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్ విభాగంలో షార్ట్ సర్క్యూట్

» విలువైన కేబుళ్లు దగ్ధం!

విశాఖపట్నం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్ (ఎస్ఎంఎస్)-2 విభాగంలో ఆదివారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్ సంభవించినట్టు పలువురు కార్మికులు తెలిపారు. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లడంతో విభాగంలోని మూడు కన్వర్టర్లలో ఉత్పత్తి నిలిచిపోయింది. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో కన్వర్టర్-3లోని అండర్ గ్రౌండ్ కేబుల్ నుంచి పొగలు వ్యాపించడంతో ఇక్కడ విధులు నిర్వహించే ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు బయటకు పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో విలువైన కేబుళ్లు కాలిపోయినట్టు తెలిసింది. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ విభాగంలో ఉత్పత్తి నిలిచిపోవడంతో హాట్ మెటల్‌ను ఎస్ఎంఎస్-1 విభాగానికి పంపి ఉత్పత్తి చేయనున్నారు. ఇదిలావుండగా రెండు రోజుల్లో ఎస్ఎంఎస్-2లో ఉత్పత్తి పునః ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం.